# భవిష్యత్ ప్రజాపాలన

మా వార్త రేపటి భవిష్యత్‌కు నిదర్శనం

తెలుగు దినపత్రిక

bhavishyatprajapalana.in / epaper.bhavishyatprajapalana.in

ASN NEWS

ఎడిటర్ : చిట్ల విజయ్‌కుమార్ రెడ్డి  తెలంగాణ - రంగారెడ్డి  సంపుటి : 01  సంచిక : 32  మంగళవారం , మార్చి 03 , 2026 ,  పేజీలు - 8 + 8  వెల : 1 /-


## ఇరాన్‌పై యుద్ధం నాలుగు వారాలు ఉండొచ్చు: డొనాల్డ్ ట్రంప్



**హైదరాబాద్ మార్చి 02 :** ఇరాన్‌పై సైనిక చర్యకు నాలుగు వారాలు ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. బ్రిటిష్ వార్తాపత్రిక డైలీ మెయిల్‌తో ట్రంప్ మాట్లాడుతూ "ఇరాన్ ఒక పెద్ద దేశం కాబట్టి ఇది నాలుగు వారాలు లేదా అంతకంటే తక్కువ సమయం

మిగతా2లో...

## దాడిలో గాయపడ్డ ఖమేని భార్య మృతి

● ఇరాన్ అధికారిక వార్తా సంస్థ వెల్లడి



**టెహ్రాన్, 02 :** అమెరికా మద్దతుతో ఇజ్రాయెల్ గత శనివారంనాడు తొలిసారి టెహ్రాన్‌పై జరిపిన దాడుల్లో తీవ్రంగా గాయపడిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ భార్య మన్సూరే ఖోజాస్తే సోమవారంనాడు మరణించినట్టు ఆదేశ అధికారిక వార్తా సంస్థ

మిగతా2లో...

## పశ్చిమాసియా ఘటనలతో ఉద్రిక్తత

### అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడికి మోడీ ఫోన్



**న్యూఢిల్లీ,మార్చి 02 :** ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సైనిక చర్య, ఇందుకు ప్రతిగా ఇరాన్ జరుపుతున్న దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణలు, డ్రోన్ దాడులపై విరుచుకుపడుతుండటం పరిస్థితిని మరింత తీవ్రం చేస్తోంది. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్, బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫాకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారంనాడు ఫోను చేశారు. ఇరువురు నేతలతో సంభాషణల్లో సౌదీ అరేబియా, బహ్రెయిన్‌పై ఇరాన్ జరుపుతున్న దాడులను మోదీ ఖండించారు. రెండు దేశాల్లోని భారతీయుల భద్రతపై ఆరా తీశారు. కాగా, దీనికి ముందు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో మోదీ ఫోనులో

మిగతా2లో...



## రాహుల్‌ను ప్రధాని చేయడమే మన కర్తవ్యం

**వికారాబాద్,మార్చి 02 :** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమని తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం మనమంతా కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మోడీ వల్ల దేశానికి తీరని నష్టం జరుగుతోందన్నారు. రాషహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమమని అన్నారు. వికారాబాద్ వేదికగా తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం సోమవారం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి

మిగతా2లో...

అందుకోసం కలసికట్టుగా పనిచేద్దాం

రాహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమం

డిసిసి అధ్యక్షులు శిక్షణ శిబిరం ముగింపులో సిఎం రేవంత్

## జల్లికట్టులో తీవ్ర విషాదం

-ఎద్దు పొడవడంతో ముగ్గురు దుర్మరణం



**చెన్నై,02 :** శివగంగై జిల్లాలో ఏర్పాటు చేసిన జల్లికట్టులో తీవ్ర విషాదం నెలకొంది. సోమవారం జరిగిన ఈ క్రీడలో ఎద్దు పొడవడంతో ముగ్గురు మరణించారు. మరో 50 మందికిపైగా గాయపడ్డారు. స్థాని కుల సహాయంతో వారందరినీ పోలీసులు ప్రభుత్వాసుపత్రికి మిగతా2లో...

## బాన్సువాడ ఘటన దురదృష్టకరం

- హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు
- ఖమ్మంలో పేదల ఇళ్లను కూల్చి రోడ్డున పడేశారు
- కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు



**కామారెడ్డి,మార్చి 02 :** హిందూ ధర్మ పరిరక్షణ కోసం అందరం కలిసి పోరాడాల్సిన సమయం వచ్చిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇటీవల బాన్సువాడలో జరిగిన ఘటన దురదృష్టకరమని చెప్పారు. కామారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. పెద్దలతో బేరసారాలు కుదుర్చుకుని వారి జోలికి వెళ్లడం లేదన్నారు.

మిగతా2లో...

## దుబాయ్‌లో చిక్కుకున్న మంత్రి తుమ్మల

- క్షేమంగానే ఉన్నట్లు సమాచారం అందచేత



**హైదరాబాద్,మార్చి 02 :** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధ జరుగుతోంది. పశ్చిమ ఆసియా దేశాల్లోనెల కొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా దుబాయితో పాటు గల్ఫ్ దేశాలు తమ గగన తలాన్ని మూసేశాయి. దీంతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకుపోయారు. గత ఐదు రోజుల క్రితం ఆయన దుబాయ్ వెళ్లారు. మంత్రి కుటుంబ సభ్యులలో ఒకరికి అకస్మాత్తుగా అనారోగ్యం కలగడంతో, మెరుగైన చికిత్స అందించడం కోసం ఆయన

మిగతా2లో...



## సూర్యాపేట జిల్లా మైనింగ్‌లో అక్రమాలు

● ఇ-వేలంలో భారీగా అక్రమాలు ● వెంటనే మైనింగ్ ప్రక్రియ ఆపాలి

● సిఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

**హైదరాబాద్,మార్చి 02 :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సూర్యా పేట జిల్లాలో మైనింగ్ ఈ-వేలంలో భారీ అక్ర మాలు చోటు చేసుకున్నాయని స్వతంత్ర విచా రణ చేసి టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 1,100 ఎకరాల రిజర్వ్ ఫారె స్ట్‌పై స్పష్టత లేకుండానే వేలం నిర్వహించారని ఆరోపించారు. కీలక సాంకేతిక వివరాల్లో లోపం, లాటిట్యూడ్, లాంగిట్యూడ్, డీజీపీఎస్ సర్వే వివరాలు వెల్లడించలేదని విమర్శించారు. జియోలాజికల్ నివేదికలు సైతం లేవని ఆరోపించారు. మినరల్ ఆక్షన్ రూల్స్-2015 ఉల్లంఘన జరిగిందని హైకోర్టు సూచనలు పట్టించుకోలేదన్నారు. పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్ల ప్రకటన,కంపెనీల ఎంపికపై అనుమానాలున్నాయని పేర్కొన్నారు. మైనింగ్‌లో అక్రమాలు జరిగాయని ఆరోపిం చారు. కేసులు ఎదుర్కొంటున్న డెక్కన్ సిమెంట్స్, ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్‌కు బ్లాక్‌ల కేటాయింపుపై సందేహాలున్నాయని తెలిపారు.టెండర్ రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అన్ని అనుమతుల తర్వాతే పారదర్శకంగా కొత్త వేలం నిర్వహించాలని సూచించారు. గనుల శాఖ చేపట్టిన ఈ వేలం ప్రక్రియ పారదర్శకతకు విరుద్ధంగా సాగిందని ఆయన విమర్శించారు.

మిగతా2లో...

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు..

- తెలంగాణవాసులకు హెల్ప్ లైన్




**న్యూఢిల్లీ,మార్చి 02 :** మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ పౌరులకు సహాయం అందించేందుకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మిగతా2లో...

## నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

- ఆకాశంలో కనిపించనున్న బ్లడ్‌మూన్



**హైదరాబాద్,మార్చి 02:** మంగళవారం రాత్రి ఆకాశంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. సంపూర్ణ చంద్రగ్రహణంతో ఈ అవకాశం దక్కనుంది. ప్రపంచవ్యాప్తంగా 'బ్లడ్‌మూన్' కనువిందు చేయనుంది. మంగలశారం మధ్యాహ్నం 3.20 గంటల ప్రాంతంలో బ్లడ్‌మూన్ దశ ప్రారంభం కానుంది. అయితే,

మిగతా2లో...

# యుద్ధం ఎఫెక్ట్ హైదరాబాద్‌కు రావాల్సిన 26 విమాన సర్వీసులు రద్దు

**హైదరాబాద్ :** ఇజ్రాయెల్–ఇరాన్ దేశాల్లో యుద్ధ వాతావరణం ఏర్పడటంతో అంతర్జాతీయ విమానయాన రంగంపై తీవ్ర ప్రభావం పడింది. ఆదివారం కువైట్, అబుదాబీ, రియాద్, మస్కట్, షార్జా, బహ్రెయిన్, దమ్మామ్, జెడ్డా, మదీనా, దోహా, దుబాయ్ నగరాల నుంచి హైదరాబాద్‌కు రావాల్సిన 26 అంతర్జాతీయ విమాన సర్వీసులు ఆయా ఎయిర్?పోర్టుల్లోనే ఆగిపోయాయి. ఉద్రిక్తత పరిస్థితులు : ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి గల్ఫ్ దేశాలకు రాకపోకలు సాగిస్తున్న ఇంటర్నేషనల్ విమాన సర్వీసులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు, వాహనాల రద్దీ భారీగా తగ్గింది. ఆయా దేశాల్లో ఉద్రిక్తత పరిస్థితులు తగ్గుముఖం పట్టిన తర్వాతనే గల్ఫ్ దేశాల విమాన సర్వీసులు పునఃప్రారంభం అవుతాయని ఎయిర్‌పోర్ట్ అధికారులు పేర్కొన్నారు. ఎయిరిండియా ట్వీట్ : ఐరోపా దేశాలకు వెళ్లాల్సిన ఆరు విమాన సర్వీసులను రద్దు చేసినట్లు ఎయిరిండియా ఎక్స్‌లో పోస్టు చేసింది. అమెరికా సహా ఐరోపాలోని కొన్ని దేశాలకు వెళ్లాల్సిన విమానాలను మిడిల్ ఈస్ట్‌లో ఉన్న ప్రత్యామ్నాయ గగనతల మార్గాల ద్వారా నడిపిస్తున్నామని తెలిపింది. అవి కూడా ఆలస్యంగా నడుస్తున్నాయని వెల్లడించింది. దుబాయ్, షార్జా విమానాలన్నింటినీ రద్దు చేసినట్లు స్పైస్‌జెట్ తెలిపింది. మరికొన్ని విమానాలు ఆలస్యంగా నడుస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. విమానయాన సంస్థలను సంప్రదించిన తర్వాతే ఎయిర్‌పోర్టుకు రావాలని దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం ఎక్స్‌లో పోస్టు చేసింది. యోగ క్షేమాల సమాచారం : మధ్యప్రాచ్యంలో యుద్ధం తీవ్రం కావడంతో హైదరాబాద్ ఆందోళన చెందుతోంది. ఉపాధి, ఉన్నత



చదువులు, పుణ్యక్షేత్రాల సందర్శనకు ఆయా దేశాలకు వెళ్లిన తమ వారు క్షేమంగా తిరిగి వస్తారో లేదోనన్న ఆందోళన హైదరాబాద్ నగరంలోని సైదాబాద్, టోలీ చౌకి, పాతబస్తీ ప్రాంతాల్లోని బంధువులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఫోన్ చేసి వారి యోగక్షేమాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. గల్ఫ్ దేశాలతోపాటు ఇజ్రాయెల్, ఇరాన్ ప్రాంతాల్లో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులు వేల సంఖ్యలో ఉన్నారు. అమెరికన్ కాన్సులేట్ వద్ద భద్రత : యుద్ధం తీవ్రరూపు దాల్చడం, పలు విమాన సర్వీసులు రద్దు కావడం, గగనతలాన్ని మూసివేయడంతో అక్కడి వారు తమ తమ స్వదేశాలకు వెళ్లాలన్న మార్గాలు లేకుండా . ప్రస్తుతం యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నవారు బంకర్లలో తలదాచుకుంటున్నారు. ఆహారం, తాగునీటి నిల్వలు నిండుకుంటుండటంతో భయాందోళనలు ఎక్కువైపోతున్నాయి. హైదరాబాద్ నగరంలోని అమెరికన్ కాన్సులేట్, ఇతర విదేశీ కార్యాలయాల వద్ద పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. టూర్‌కు వెళ్లి చిక్కుకున్నారు : మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు దుబాయిలో చిక్కుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు హైదరాబాద్‌కు చెందిన బంగారు నగలకు ఫైనాన్స్ చేసే ఓ కంపెనీ తమ బ్యాంకులో పని చేస్తున్న 340 మందిని నాలుగు రోజుల కిందట దుబాయి టూర్?కు తీసుకెళ్లింది. అందులో 8 మంది మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వారు ఉన్నారు. వారంతా షెడ్యూల్? ప్రకారం పర్యటన ముగించుకొని శనివారం స్వదేశానికి రావాల్సి ఉంది. కానీ ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా దాడులతో దుబాయితో పాటు గల్ఫ్ దేశాలు తమ గగన తలాన్ని పూర్తిగా మూసేశాయి. దీంతో వారంతా ఎయిర్?పోర్టులోనే చిక్కుకున్నారు. అనంతరం వారికి కంపెనీ ప్రతినిధులు హోటల్‌లో బస చేసేందుకు ఏర్పాటు చేశారు. అమెరికా కాన్సులేట్ వద్ద నిరసనలు : ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణ వార్తతో ఆదివారం పాకిస్థాన్ రణరంగంగా మారింది. ఖమేనీ మృతికి వ్యతిరేకంగా వందలాది మంది నిరసనకారులు కరాచీలో ఉన్న అమెరికా కాన్సులేట్ వద్దకు చేరుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. అక్కడ తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో నిరసనకారులు, భద్రతా దళాల మధ్య చెలరేగిన ఘర్షణల్లో 10 మంది మరణించినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. 30 మందికిపైగా గాయపడినట్లు పేర్కొన్నాయి. మరోవైపు, ఖమేనీ మృతికి వ్యతిరేకంగా పాకిస్థాన్‌లోని పలు నగరాల్లో సైతం ఆందోళనలు చెలరేగాయి.

# రాజ్యసభ సీటు మాదిగలకు కేటాయించాలి : మంద కుమార్ మాదిగ




**హనుమకొండ చౌరస్తా, మార్చి 2:** తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభ సీటు మాదిగలకు కేటాయించాలని ఎమ్మెస్పీ జాతీయ నేత మందకుమార్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్యసభ సీటును మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కుమార్ మాదిగ మాట్లాడుతూ మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగల ఎమ్మెల్యే స్థానాలు తగ్గించి మాలలకు కేటాయించడం మాదిగ జాతికి తీరని అన్యాయం కాంగ్రెస్ పార్టీ చేసిందన్నారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో మూడు పార్లమెంటు స్థానాలు ఉంటే ఒకటి కూడా మాదిగలకు కేటాయించకుండా కాంగ్రెస్ పార్టీ మాదిగ జాతిని మోసం చేసిందన్నారు. నామినేట్ పదవులల్లో మాదిగలకు అవకాశాలు రావాలని ముఖ్యమంత్రి ఇప్పటికైనా మాదిగ జాతికి తీరని అన్యాయం చేయకుండా రాజ్యసభ సీట్లు వెంటనే కేటాయించాలని లేని పక్షంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పోరాటానికి సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ జాతీయ నాయకులు వేల్పుల సూరన్న కాపు, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్రా బిక్షపతి మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, రాష్ట్ర నాయకులు మంద రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సుంచు మాదిగ పాల్గొన్నారు..

# పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం.. తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్

**న్యూఢిల్లీ, మార్చి 2:** మధ్యప్రాచ్యంలో(పశ్చిమాసియా) నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ పౌరులకు సహాయం అందించేందుకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ చర్య తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. మధ్యప్రాచ్యం(పశ్చిమాసియా) ప్రాంతంలో ఏర్పడుతున్న పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం సమగ్రంగా పర్యవేక్షిస్తోంది. తెలంగాణ భవన్‌లోని సీనియర్ అధికారులు.. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ




పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఆయా దేశాల్లో నివసిస్తున్న, చిక్కుకున్న తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యుల నుంచి వెల్లువెత్తుతున్న ఫిర్యాదుల దృష్ట్యా.. తెలంగాణ భవన్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది రాష్ట్ర ప్రభుత్వం. అవసరమైన సమన్వయం, సహాయం అందించేందుకు 24ఇ7 కంట్రోల్ రూమ్ పనిచేస్తుంది. ఆ ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ పౌరులు, తెలంగాణలో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఏవైనా ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు, అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఈ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చు. మధ్యప్రాచ్యం పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.

# 'మాతృదేవోభవ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



**కోదాడ, మార్చి 02 :** మాతృదేవోభవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలోని ఆర్.ఎస్.వి ఫంక్షన్ హాల్‌లో యశోద హాస్పిటల్ వారి సౌజన్యంతో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు మాతృదేవోభవ ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. శిబిరంలో సుమారు 300 మందికి పైగా రోగులకు గుండె, ఎముకల వ్యాధులకు నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ వాడపల్లి రంగమ్మ, గుండపునేని నాగేశ్వరరావు, పందిరి నాగిరెడ్డి, సొసైటీ కోదాడ అధ్యక్షురాలు పబ్బా గీతా దేవి, కార్యదర్శి ఓరుగంటి రమాదేవి, కోశాధికారి ఇమ్మడి సతీష్ బాబు, గౌరవ రాచర్ల కమలాకర్, ఉపాధ్యక్షులు బొగ్గారపు రేఖా రాణి, మంజుల, స్వాతి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

# జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టులో విచారణ

కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరుగుతోంది. కేసీఆర్, హరీశ్?రావు, ఎస్కే జోషి, స్మితా సబర్వాల్ పిటిషన్లపై ఇవాళ ఉన్నత న్యాయస్థానం విచారణచేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపిస్తుండగా, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తరఫున నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసి రాజకీయ వ్యూహంలో భాగంగా కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గతంలో కేసీఆర్ హరీశ్‌రావులు ఇచ్చిన పిటిషన్‌లో పేర్కొన్నారు. నివేదిక కాపీని అందజేయకుండా ప్రభుత్వం మీడియా ప్రచురణలకు ఇవ్వడంలో దురుద్దేశపూరితం, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని




ఆరోపించారు. కాళేశ్వరం లోపాలకు నేను ఏ విధంగా బాధ్యుడినో చెప్పాలి : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైనటువంటి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో డిజైనింగ్ లోపాలు, ప్రణాళిక సహా అన్నింటికీ సీఎంగా తానే బాధ్యుడినంటూ జస్టిస్ ఘోష్ కమిషన్ ఏవిధంగా నిర్ణయించిందో చెప్పాల్సినటువంటి అవసరం ఉందంటూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల హైకోర్టుకు నివేదించారు. ప్రభుత్వం అందించినటువంటి రికార్డుల ఆధారం గా నిర్ణయించడమనేది సరికాదని ఆయన అన్నారు. అందుకు సంబంధించిన అన్ని ఆధారా లను సమర్పించి వివరణ తీసుకున్నాక మాత్రమే ఓ నిర్ధారణకు రావాల్సి ఉంటుందన్నారు. అయితే కమిషన్ ఇందుకు విరుద్ధంగా వ్యవహరించిందని హైకోర్టుకు నివేదించారు. సాక్షిగా పిలిచి దోషిగా అభియోగాలు మోపారని కేసీఆర్ తన పిటిషన్‌లో తెలిపారు. తన ప్రతిష్ఠ దెబ్బతీసేలా నిర్ధరణ ఉన్నప్పుడు, అందుకు గల ప్రాతిపదికను సెక్షన్ 8 బీ, సీ ప్రకారం నోటీసు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. పిటిషనర్‌కు వ్యతిరేకంగా అభియోగాలు మోపిన వారి వివరాలు చెప్పలేదన్న కేసీఆర్, వాంగ్మూలం ఇచ్చిన వారిని ప్రశ్నించే అవకాశం ఇవ్వలేదన్నారు.

# రేవంత్ తప్పులు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా ?


**హైదరాబాద్ :** యూపీలో మాదిరిగానే తెలంగాణాలో కూడా సీఎం రేవంత్ రెడ్డి పాలనలో బుల్డోజర్ రాజ్యం నడుస్తుందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు . రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పేద ప్రజల ఇళ్లను నేలమట్టం చేస్తున్న విషయం రాహుల్ గాంధీ కి తెలియదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అరాచకాలపై మౌనంగా ఎందుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు .గత రెండున్నర ఏళ్లలో రాహుల్ గాంధీ తెలంగాణకు వస్తున్నారు.. వెళ్తున్నారు. రాష్ట్ర అభివృద్ధి మాత్రం ముందుకు పోవటం లేదని ఆరోపించారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో అధికారులు పేదల ఇండ్లను కూల్చివేయడం తో ప్రస్తుతం గాజాలా మారిందని పేర్కొన్నారు. యుద్ధం జరిగితే ఎలా ఉంటుందో ఇప్పుడు వెలుగుమట్ల పరిస్థితి అలానే ఉందని అన్నారు. రాహుల్ గాంధీ ఖమ్మం వెళ్లి రోడ్డున పడ్డ ప్రజల దీనస్థితిని తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీల కోసం పార్లమెంట్‌లో రాహుల్ కొట్లాడాలని కోరారు. పేద ప్రజల ఇళ్లు కూల్చిన చోటే కట్టించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోందని అన్నారు.




# రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన వేళ.. కల్వకుంట్ల కవిత ట్వీట్

**వికారాబాద్ :** వికారాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో ప్రసంగించేందుకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ .. ఇవాళ తెలంగాణకు వచ్చారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రాహుల్ గాంధీకి కాంగ్రెస్ నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో నిర్వహించిన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో హాజరయ్యారు. అయితే రాహుల్ గాంధీ రాష్ట్రానికి వచ్చిన వేళ.. తెలంగాణ జాగృతి చీఫ్ కవిత.. సోషల్ మీడియా వేదికగా ప్రశ్నలు సంధించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుపై రాహుల్ గాంధీని కవిత నిలదీశారు.

ఈ సందర్భంగా ట్వీట్ చేసిన కవిత.. 'రాహుల్ గాంధీ జీ.. దో లాక్ నౌకరీ దో. తెలంగాణలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మీరు హామీ ఇచ్చి రెండున్నరేళ్లు అయ్యింది. డీసీసీ అధ్యక్షుల శిక్షణ కోసం తెలంగాణకు వస్తున్న రాహుల్ గాంధీ గారు మీ హామీని నమ్మి శిక్ష అనుభవిస్తున్న మా నిరుద్యోగుల గోడు మీకు పట్టదా. మీ పార్టీ గద్దెనెక్కడానికి నిచ్చెనమెట్లుగా నిలిచిన యువత ఆశలు, ఆకాంక్షలను



చిదిమేశారు. ఉద్యోగాలు ఇవ్వాలని అడిగితే పోలీసులతో అణచివేస్తున్నారు. యూత్ డిక్లరేషన్ బోగస్‌గా మారింది.. జాబ్ క్యాలెండర్ పత్తా లేదు.. కాంగ్రెస్ అంటేనే మోసం.. వంచన అనే మాటను నిలబెట్టుకున్నారు. రాహుల్ జీ ఇది పోరాటాల పురిటిగడ్డ.. మీ హామీని నిలబెట్టుకోండి.. 2 లక్షల ఉద్యోగాల భర్తీ హామీని అమలు చేయించండి' అని పేర్కొన్నారు. ఇక పీఏసీ సమావేశంలో రాహుల్ గాంధీతోపాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.. ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలతో పాటు ముఖ్యనేతలు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు.. పార్టీ చేపట్టే కార్యక్రమాల నిర్వహణ సహా అనేక అంశాలపై హస్తం పార్టీ నేతలతో రాహుల్ గాంధీ చర్చలు జరిపారు. గత 9 రోజులుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల ట్రైనింగ్ శిబిరం కొనసాగుతోంది. ఇవాళ జరిగే ముగింపు సమావేశంలో డీసీసీ అధ్యక్షులు, నేతలకు రాహుల్ గాంధీ దిశానిర్దేశం చేయనున్నారు.

# మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు బెయిల్ మంజూరు

**మంచిర్యాల :** అక్రమ కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ( కు బెయిల్ ( మంజూరయ్యింది. కోర్టు రూ. 25వేల పూచీకత్తుతో, షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. సోమవారం ఉదయం బాల్క సుమన్ కస్టడీ పిటిషన్‌ను వాయిదా వేసిన కోర్టు సాయంత్రం బెయిల్ మంజూరు చేసింది. అధికార కాంగ్రెస్ పార్టీ బాల్కసుమన్‌కు బెయిల్ రాకుండా అడుగడుగునా అడ్డుపడింది. బెయిల్ పిటిషన్‌పై మంచిర్యాల కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ పోలీసులతో జిల్లా కోర్టులో అప్పీల్ చేయించింది. పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన జిల్లా కోర్టు ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది. ఇక బెయిల్ పిటిషన్‌పై లంచ్ తర్వాత తీర్పును వెల్లడించింది. గత 15 రోజులుగా ఆదిలాబాద్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యేను బీఆర్ఎస్ అగ్ర నాయకులు పరామర్శించి ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ప్రశ్నించారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అధిక సంఖ్యలో గెలుపొందింది. అయితే మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను కాంగ్రెస్ అడ్డుకుని చెన్నూర్ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌తో పాటు మరో 20 మందిపై అక్రమ కేసులు బనాయించి జైలులో బంధించింది.



# బీవీఆర్ఐటీలో ఇంటర్వ్యూలు.. విద్యా పర్యటనలో పాల్గొన్న విద్యార్థులు

**నర్సాపూర్, మార్చి2:** నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో సోమవారం బాజా సే ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎం బాజా సే ఇండియా– 2026 పోటీలు ఫిబ్రవరి 25 నుండి మార్చి 3 వరకు బీవీఆర్ఐటీ కళాశాలలో నాలుగు రోజుల పాటు విజయవంతంగా జరిగాయి. ఐదవ రోజు అత్యంత ఆసక్తిగా ఎదురుచూసిన హెచ్ ఆర్ మీట్ కార్యక్రమం సోమవారం ప్రత్యేకంగా నిలిచింది. ఈ కార్యక్రమం ద్వారా పరిశ్రమలతో విద్యార్థుల అనుసంధానం మరింత బలపడింది. దేశవ్యాప్తంగా వచ్చిన ప్రతిభావంతులైన యువ ఇంజనీర్లతో నేరుగా మమేకమయ్యేందుకు ప్రముఖ సంస్థలైన జేకే టయర్స్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, టీవీఎస్ మోటర్ కంపెనీ, వర్రోక్ నియామక ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ




ప్రక్రియలో భాగంగా ఎం బాజాలో పాల్గొన్న ప్రతీ విద్యార్థి బాజా అస్సెస్మెంట్ టెస్ట్ అనే సమగ్ర పరీక్షకు హాజరయ్యారు. ఇందులో సాధించిన ప్రతిభ ఆధారంగా సంస్థలు అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేసి, ఆన్లైన్ అంచనాలు, గ్రూప్ డిస్కర్షన్, సాంకేతిక ఇంటర్వ్యూలు, హెచ్ ఆర్ ఇంటర్వ్యూల వంటి పద్ధతి ద్వారా నియామక దశలకు ఆహ్వానించాయి. ఈ సందర్భంగా బాజా సే ఇండియా జాయింట్ కన్వీనర్ డా. మురళీకృష్ణ మాట్లాడుతూ.. హెచ్ఎర్ మీట్ ద్వారా పరిశ్రమలకు ఇప్పటికే పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సిద్ధమైన ప్రతిభావంతులైన అభ్యర్థుల సమూహం లభించిందని వెల్లడించారు. ఫలితంగా విద్యార్థులు ఉద్యోగావకాశాల కోసం మాత్రమే కాకుండా నేరుగా పరిశ్రమల్లో అన్నారు. విద్యార్థుల విద్యా పర్యటన..నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలను శివంపేట్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 100 మంది విద్యార్థులు అలాగే 10 మంది అధ్యాపకులు సోమవారం సందర్శించారు. విద్యార్థులను రెండు బ్యాచులుగా విభజించి తద్వారా ప్రతీ విద్యార్థికి అన్ని సౌకర్యాలను సమగ్రంగా వీక్షించే అవకాశం లభించింది.

# శ్రీకాకుళం జిల్లాలో ఏసీబీ దాడులు



**శ్రీకాకుళం, మార్చి 2 :** శ్రీకాకుళం జిల్లాలో ఏసీబీ అధికారులు (సోమవారం) విస్తృత తనిఖీలు చేపట్టారు. డీసీసీబీ కాలనీలోని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ గడ్డి బాలముకుందం ఇంట్లో విస్తృత సోదాలు నిర్వహించారు. జనవరి 28వ తేదీన కంచిలి ప్రాంతంలో బాలముకుందం వార్డెన్ల నుంచి రూ. 1.84 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెండ్‌గా పట్టుకున్నారు. ఆయనపై ఫిర్యాదులు రావడంతో ఏసీబీ అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థుల నుంచి రూ. 5లు వసూలు..బీసీ హాస్టల్లో నివసిస్తున్న విద్యార్థుల నుంచి నెలవారీగా రూ. 5ల చొప్పున వసూలు చేస్తున్నట్లు బాలముకుందంపై ఆరోపణలు ఉన్నాయి. ఈ ఫిర్యాదుల కారణంగా ఏసీబీ అధికారులు ఆయన నివాసాలు, కార్యాలయాల్లో విస్తృత సోదాలు నిర్వహించారు. ఏసీబీ సోదాల సమయంలో నివాసాల నుంచి సంబంధిత డాక్యుమెంట్లు, రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

# ప్రజల మనసు గెలవడమే లక్ష్యం.. పబ్లిక్ పర్సెప్షన్‌పై ముఖ్యమంత్రి దిశానిర్దేశం



**అమరావతి:** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు తన పాలనలో 'రియల్-టైమ్ గ్రాస్ సెటిల్మెంట్ 'పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్' ) ప్రజాభిప్రయాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. సోమవారం ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్సన్‌పై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సేవలపై ప్రజలు సంపూర్ణంగా సంతృప్తి చెందాల్సిందేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అధికారుల తీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని తేల్చిచెప్పారు. ఈ నెల నుం కనీసం 80 శాతం నుంచి 90 శాతం తగ్గకుండా పబ్లిక్ పర్సెప్సన్ ఉండాలని స్పష్టం చేశారు. సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ..'పెన్షన్ల పంపిణీలో లోటుపాట్లు తలెత్తుతున్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆర్టీసీ బస్సు సర్వీసులు బావున్నా.. ఆర్టీసీ బస్ స్టేషన్‌లో సౌకర్యాలు, ఔట్ సోర్సింగ్ సర్వీసులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలి. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలి. రాష్ట్రంలో వరుస ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలి, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలి. బాణసంచా పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై అధికారులు శివకాశీకి వెళ్లి అధ్యయనం చేసిరావాలి. రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, డిజిటల్ సేవలు, సిబ్బంది పనితీరు బాగుంది. అవినీతికి తావులేకుండా రాష్ట్రంలోని మొత్తం 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిజాయితీ కలిగిన అధికారులకే అవకాశం ఇవ్వాలి. వాట్సప్ మనమిత్ర సేవలు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి, నూటికి నూరు శాతం వాట్సప్ సేవల వినియోగం జరగాలి. అన్ని శాఖల పనితీరు మెరుగు పరుచుకునేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి' అని అన్నారు.

# కాకినాడ సీజన్ 5 రెస్టారెంట్‌లో దారుణం

**కాకినాడ, మార్చి 2:** కాకినాడలో సీజన్ 5 రెస్టారెంట్ నిర్వాకం వెలుగులోకి వచ్చింది. ఈ రెస్టారెంట్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు సహా రెవెన్యూ, మున్సిపల్, హెల్త్, సివిల్ సప్లైస్ విభాగాల అధికారులు సోమవారం ఆకస్మికంగా దాడులు చేశారు. రెస్టారెంట్‌లో వినియోగదారులకు నిల్వ చేసిన మాంసం వడ్డిస్తున్నట్లు గుర్తించారు. ఈ దాడుల్లో కిలోలకొద్దీ చికెన్, ఫ్రై శాంపిల్స్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారులు సీజ్ చేశారు. నిల్వ మాంసం కావడంతో అన్నింటినీ సీజ్ చేసినట్లు తెలిపారు. నిల్వ మాంసాన్ని కస్టమర్లకు ఎలా వడ్డిస్తారని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రెస్టారెంట్‌లో అపరిశుభ్ర వాతావరణం ఉండటాన్ని కూడా అధికారులు తప్పుబట్టారు. ఈ చర్యలతో రెస్టారెంట్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇటీవల ప్రత్తిపాడులో జంతుకొవ్వుతో నూనె తయారు చేస్తూ ఓ ముఠా పట్టుబడిన ఘటన మరువకముందే కాకినాడ రెస్టారెంట్ నిర్వాహకుల మోసం వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపుతోంది. కాకినాడలోని అనేక హోటల్స్‌లో తరచూ ఆహార కల్తీ జరుగుతోందనే ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దాడులు చేస్తున్నారు.



# తిరుపతిలో దారుణం.. బంగారు నగల కోసం వృద్ధురాలిని




**తిరుపతి, మార్చి 2:** తిరుపతిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. బంగారు నగల కోసం వృద్ధురాలిని దుండగులు హత్య చేశారు. వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అరవపల్లె వీధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతురాలు కె.లక్ష్మమ్మగా(67) గుర్తించారు. టీటీడీలో రిటైర్డ్ అయిన ఆమె ఇంట్లో ఒంటరిగా ఉండగా ఈ ఘటన జరిగింది. దుండగులు ఆమె గొంతును నులిమి, ఆ తర్వాత దిండుతో అదిమి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. ఆమె ఒంటిపై ఉన్న 100 గ్రాములకు పైగా బంగారు నగలను కాజేసి పరారయ్యారు.సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. హత్యకు గల ఆధారాలను క్లూస్ టీంతో కలిసి వెస్ట్ పోలీసులు సేకరించారు. మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. సొంత మనవడే ఈ హత్యకు విచారణలో పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ హత్యకు సంబంధించి ఇప్పటికే ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# వినూత్న బోధనలో ఆ టీచర్ ఆదర్శంగా నిలిచారు

**అమరావతి, మార్చి2 :** సృజనాత్మక విద్యా బోధనతో విద్యార్థుల్లో ఆసక్తిని పెంచుతున్న శ్రీకాకుళం జిల్లా టీచర్ కూర్మాన అరుణ కుమారిని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. జి.సిగడాం మండలం పున్నాం పంచాయతీ బూటుపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానో పాధ్యాయినిగా పనిచేస్తున్న అరుణకుమారి వినూత్న పద్ధతులతో పాఠాలను బోధిస్తున్నారని కొనియాడారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మంత్రి నారా లోకేశ్ ట్వీట్ పెట్టారు. అరుణకుమారి టీచర్ సంప్రదాయ బోధనకు భిన్నంగా సృజనాత్మక పద్ధతులను అనుసరిస్తున్నారని మెచ్చుకున్నారు. పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలతో మాత్రమే కాకుండా విద్యార్థులకు అర్థమయ్యేలా బొమ్మలు రూపొందించడం, పాఠాలకు సంబంధించిన షార్ట్ ఫిల్మ్స్ తయారు చేయడం, వర్కింగ్ మోడల్స్ ద్వారా ప్రాక్టికల్ అవగాహన కల్పించడం, పిల్లలతో ప్రత్యక్ష కార్యకలాపాలు చేయించడం వంటి పద్ధతులను అమలు చేస్తున్నారని ప్రశంసించారు. విద్యార్థుల్లో ఆసక్తి. ఈ విధానం వల్ల విద్యార్థులు సులభంగా పాఠాలను అర్థం చేసుకుంటున్నారని మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ముఖ్యంగా చిన్న తరగతుల పిల్లల్లో నేర్చుకునే ఆసక్తి పెరుగుతోందని చెప్పుకొచ్చారు. గ్యారంటీడ్



ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ్, రాష్ట్ర, జాతీయ స్థాయి విద్యా శిక్షణల్లో కేఆర్పీగా, మాడ్యూల్ రచయితగా, ఈ--కంటెంట్ సృష్టికర్తగా అరుణ కుమారి టీచర్ ఎనలేని కృషి చేస్తున్నారని ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఆధునిక, సృజనాత్మక బోధన సాధ్యమేనని ఈ టీచర్ నిరూపించారని తెలిపారు. పరిమిత వనరులతో కూడా నాణ్యమైన విద్య అందించవచ్చని ఆమె చూపించారన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచడం, పాఠశాలపై ఆసక్తి కల్పించడం, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నారని కొనియాడారు. అరుణకుమారి టీచర్ గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగు. వినూత్న డిజిటల్ బోధన చేస్తూ బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. టీచర్ కృషి వల్ల విద్యార్థుల్లో ప్రాథమికంగా చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలు మెరుగుపడుతున్నాయని వివరించారు. ఆమె రాష్ట్రానికి స్ఫూర్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ లక్ష్యాన్ని సాధించడంలో ఇలాంటి టీచర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. టీచర్ సృజనాత్మక బోధన విధానం ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. తమ ప్రభుత్వం విద్యారంగంలో నాణ్యత పెంపు కోసం పలు సంస్కరణలు చేపడుతోందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో అరుణకుమారి వంటి ఉపాధ్యాయులు విద్యా వ్యవస్థకు బలంగా నిలుస్తున్నారని మెచ్చుకున్నారు. అరుణకుమారి లాంటి టీచర్ల వల్ల ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరుగుతోందని చెప్పుకొచ్చారు. విద్యార్థుల హాజరు పెరుగుతోందని, నేర్చుకునే సామర్థ్యం మెరుగుపడుతోందని, ప్రభుత్వ విద్యా సాధ్యమవుతున్నాయని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# కొడాలి నానికి ఆ భయం పట్టుకుంది: వెనిగండ్ల రాము

**కృష్ణా జిల్లా, మార్చి 2:** కూటమి ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాజీ మంత్రి కొడాలి నాని చేసిన వ్యాఖ్యలపై గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. వైసీపీ ఇన్‌ఛార్జ్ పదవి నుంచి తొలగిస్తారనే భయంతో నాని బిక్కుబిక్కుమంటూ మాటలు చెబుతున్నారని ఆయన విమర్శించారు. పాపాలు, తప్పులు చేసిన వారెవరైనా జైలుకు వెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. జైల్లో గుట్కాలు ఉంటాయా, సౌకర్యాల సంగతి తెలుసుకునేందుకే అంబటి రాంబాబును కలిశారని రాము ఎద్దేవా చేశారు. చేసిన తప్పులు, పాపాలు బయటపడతాయనే భయం నానిని పట్టుకుందని వెనిగండ్ల రాము అన్నారు. వంద రోజుల జైలు టైం కూడా పెట్టుకున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. నానిని లేదా ఎవరినైనా అన్యాయంగా అరెస్ట్ చేసే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. తప్పు చేసిన వారు ఎవరైనా చట్టం ముందు సమానమేనని, టీడీపీ కార్యకర్త అయినా అదే



వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. సప్త సముద్రాలు దాటి తమ సంగతి చూడాల్సిన అవసరం లేదని.. గుడివాడ ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెబితే చాలని రాము సూచించారు. పరామర్శించి అటునుంచి అటే వెళ్లిపోయారని, గుడివాడ ప్రజలకు మొహం చూపించే సాహసం కూడా లేదని వెనిగండ్ల రాము విమర్శించారు. నిజమేంటో ప్రజలకు తెలుసునని, సొల్లు చెప్పుకుంటూ పోతే ఈసారి డిపాజిట్లు కూడా రావని ఆయన హెచ్చరించారు. ప్రజలు పూర్తిగా మర్చిపోయిన వ్యక్తి గురించి మాట్లాడడం వ్యర్థమని రాము అభిప్రాయపడ్డారు. ప్రతిపక్ష హోదా గురించి తప్పితే, ప్రజల గురించి వైసీపీ వారికి ఏమీ పట్టదని విమర్శించారు. గుడివాడ నియోజకవర్గంలో వరదలు వచ్చినప్పుడు ఎక్కడికి పోయారని.. ఒక్కరికైనా సహాయం అందించారా అని ప్రశ్నించారు. 2019లాగా ఇక ప్రజలు మోసపోరని వెనిగండ్ల రాము పేర్కొన్నారు.

# గరికపాటి సలహాలు మాకు అవసరం లేదు.. కమలానంద భారతి ధ్వజం

**విజయవాడ, మార్చి 2:** ఆంధ్రప్రదేశ్ పేరును తెలుగునాడుగా మార్చాలని ప్రముఖ ప్రవచన కర్త గరికపాటి నరసింహారావు చేసిన వ్యాఖ్యలపై భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి తీవ్రంగా స్పందించారు. తాజా వివాదంపై ఆయన (సోమవారం) వీడియో విడుదల చేశారు. వింత పోకడలు, వింత ఆలోచనలు ఎందుకు వస్తున్నాయో తెలియడం లేదని ధ్వజమెత్తారు. మహా సంకల్పంలో అంగ, వంగ, కళింగ, సౌరాష్ట్ర అని చెప్పుకునే క్రమంలో కేరళ, ద్రవిడ, ఆంధ్రా అని వస్తుందని వివరించారు. రామాయణ కాలం నుంచి ఇక్కడ ఒక జాతి ఉందని.. దానికి ఆంధ్రా అనే పేరు ఉందని ప్రస్తావించారు. ఎన్టీఆర్ ఆంధ్రుల ఆత్మగౌరవం. ఆంధ్ర మహాభారతం, ఆంధ్రభాగవతం రాశారని కమలానంద భారతి తెలిపారు. అడిగి వారు లేరని తెలివి, పాండిత్యం, అధిక ప్రసంగం ఎక్కువయ్యి తెలుగు భాగవతం, తెలుగు భారతం జరుపుకుంటున్నారని అన్నారు. మాజీ సీఎం నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీ పెట్టారని.. ఆయన నినాదం



ఆంధ్రుల ఆత్మగౌరవమని ఉద్ఘాటించారు. రాష్ట్రాల విభజన జరిగిందని.. మానసికంగా అందరం కలిసే ఉన్నామని చెప్పుకొచ్చారు. సంస్కృతాంధ్ర అనాలి తప్ప.. సంస్కృత తెలుగు అనేది దుష్ట సమాసమని నన్నయభట్టు చెప్పారని ప్రస్తావించారు. శాతవాహనులు, అనేకులు ఆంధ్రులు అనే చదువుకున్నారని తెలిపారు. ఆంధ్ర అనే పదం అనకూడదనేలా కొందరు మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. గరికపాటికి ఆ నైతిక బాధ్యత లేదు. గరికపాటి ఆంధ్రకు రారని.. తెలంగాణలో స్థిరపడ్డారని కమలానంద భారతి గుర్తుచేశారు. వేసవి, సంక్రాంతి సెలవులకు, వచ్చి 5 కోట్ల మంది ఎలా ఉండాలో చెప్పే నైతిక బాధ్యత ఆయనకు లేదన్నారు. ఏపీ అంటే తెలుగు కాదా అని ప్రశ్నించారు. నాడు, ప్రదేశ్ అనేది సంస్కృత పదం కాదా అని నిలదీశారు. ఇలాంటి మేధావులే ఏపీకి మద్రాస్ రాకుండా చేశారని ఆగ్రహించారు. నాలుగు జిల్లాలకు రాయలసీమ అనే పేరు పెట్టే పరిస్థితులు తెచ్చారని తెలిపారు. విచ్ఛిన్నకర పరిస్థితులు ఎందుకు తెస్తున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రాంతం, తమ బతుకులు ఎలా ఉండాలో తమకు తెలుసునని చెప్పుకొచ్చారు. ఎక్కడో ఉండే గరికపాటి ఇక్కడికి వచ్చి సలహాలు ఇవ్వొద్దని హితవు పలికారు. తాము ఆంధ్రప్రదేశ్ ప్రజలుగా ఉంటామని.. ఎవ్వరు వేలు పెట్టొద్దని కమలానంద భారతి సూచించారు.

# గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారి కోసం చర్యలు

**అమరావతి, మార్చి 2 :** గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారిని క్షేమంగా తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీ ఎంఆర్ఐ సాధికారిత వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఏపీ ఎన్నార్టీ కో ఆర్డినేటర్ల ద్వారా తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని కోరారు. తెలుగు వారి క్షేమం కోసం చర్యలు..సోమవారం అమరావతి వేదికగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. ఇజ్రాయిల్ - ఇరాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం కారణంగా, గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయని చెప్పుకొచ్చారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆయా దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారి క్షేమం కోసం నిరంతరం తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పుకొచ్చారు. వారిని తిరిగి రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. వారి వసతి, భద్రతపై చర్యలు..ఆయా దేశాల్లో ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా కొన్ని విమానాశ్రయాల్లోని ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి



కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, తాము ఎప్పటికప్పుడూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్నార్టీ) ద్వారా ఇబ్బందుల్లో ఉన్న ప్రవాసాంధ్రులకు అవసరమైన సహాయం చేసేందుకు గానూ చర్యలు చేపడుతున్నామని వివరించారు. గల్ఫ్ దేశాల్లోని ఏపీ ఎన్నార్టీ కోఆర్డినేటర్లను అప్రమత్తం చేసి, స్థానికంగా ఉన్న తెలుగు కుటుంబాల సహకారం తీసుకోవాలని సూచించారు. వారి ద్వారా తాత్కాలిక వసతి, భద్రత, అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. కోఆర్డినేటర్లతో సంప్రదింపులు..ఏపీ ఎన్నార్టీ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని మానిటర్ చేస్తూ, కోఆ ర్డినేటర్లతో సంప్రదింపులు జరుపుతున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వివరించారు. స్థానికంగా ఉన్న ఇండియన్ ఎంబసీ సేవలను, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు తమ వివరాలను ఏపీ ఎన్నార్టీఎస్ 24/7 హెల్ప్‌లైన్ 0863 - 2340678, వాట్సాప్: o91 85000 27678 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. వీటితోపాటు ఈమెయిల్: అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారు వెంటనే సంప్రదించి సహాయం పొందాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

# రాజధాని నిర్మాణ పనుల ఆలస్యంపై మంత్రి నారాయణ ఆగ్రహం

**అమరావతి :** ఇన్నర్ రింగ్ రోడ్డులో తన స్థలం కూడా పోయిందంటూ ఏపీ మంత్రి నారాయణ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇన్నర్ రింగు రోడ్డు వ్యహారంలో అక్రమాలు జరిగాయని తనపై కూడా కేసులు పెట్టారని.. కానీ తాను 2001లో కొనుగోలు చేసిన 60 సెంట్ల నా సొంత స్థలం కూడా తన స్థలం ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్మెంట్‌లో పోయింది అన్నారు. విజయవాడ సమీపంలో ఈడుపుగల్లులో ఉన్న తన స్థలం మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్డు వెళ్తుంది అన్నారు. 'మా వాళ్లు ఆ స్థలంలో బిల్డింగ్ నిర్మాణం కోసం వెళ్తే సీఆర్డీయే వాళ్లు మీ స్థలం లేదని మా వాళ్లతో చెప్పారు. కానీ గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమాలు జరిగాయని ప్రచారం చేశారు.. ప్రస్తుతం కోర్టులో కేసు ఉంది కాబట్టి.. ఎలాంటి కామెంట్స్ చేయను' అన్నారు నారాయణ. మంత్రి నారాయణ అమరావతిలోని నేలపాడులో పర్యటించారు. అక్కడ నిర్మాణంలో ఉన్న గెజిటెడ్ అధికారులు టైప్ -1, టైప్ -2, గ్రూప్ - డి ఉద్యోగుల క్వార్టర్లను పరిశీలించారు. అమరావతిలో భవనాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని.. మొత్తం 4026 ఇళ్లకు అంతర్గత పనులు జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో పనులు నిలిచిపోవడంతో అనేక ఇబ్బందులు వచ్చాయని..రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు ఆలస్యం చేస్తున్నారంటూ కాంట్రాక్టు సంస్థలపై మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. (సోమవారం) రాజధాని ప్రాంతంలో మంత్రి పర్యటించారు. నేలపాడు ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న గెజిటెడ్



అధికారుల క్వార్టర్స్, గ్రూప్-డి ఉద్యోగుల క్వార్టర్స్‌తో పాటు వివిధ నిర్మాణాలను పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయలేకపోతే వెళ్లిపోవాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులపై మంత్రి నారాయణ అసహనం వ్యక్తం చేశారు. షాపూర్ జీ పల్లోంజీ కన్స్ట్రక్షన్ సంస్థకు చెందిన ఇద్దరు ప్రతినిధులను వెంటనే పంపించేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆ సంస్థ యాజమాన్యం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికినుల ఆలస్యంపై సంజాయిషీ ఇవ్వాలని మంత్రి నారాయణ ఆదేశించారు. రాజధాని నిర్మాణాలు వేగంగా, నాణ్యతగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు మంత్రి సూచించారు. వర్షాల వల్ల గత నవంబర్ వరకు పనులు జరగలేదన్నారు. అమరావతిలో ప్రైవేట్ సంస్థలు నిర్మాణ పనులు కూడా చాలా వరకూ జరుగుతున్నాయని.. టార్గెట్ ప్రకారం పనులు చేయకపోవడంపై షాపూర్జీ - పల్లోంజి మేనేజ్మెంట్‌తో మాట్లాడుతున్నట్లు తెలిపారు. అమరావతిలో అభివృద్ధి పనులు ఆలస్యం చేస్తున్నారంటూ కొన్ని కాంట్రాక్ట్ సంస్థలపై మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. టార్గెట్ పెట్టుకుని పనులు చేస్తున్నప్పుడు అందుకు తగినవిధంగా నిర్మాణ సంస్థలు పనులు చేయాల్సిందే అన్నారు. ఒకవేళ పనులు చేయలేకపోతే వెళ్లిపోవచ్చని తేల్చి చెప్పారు. అమరావతిపై వైఎస్సార్‌సీపీ నేతలు చేసే ఆరోపణల్ని ప్రజలు నమ్మరన్నారు. గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో గేమ్ ఆడకుండా ఉండుంటే అమరావతిలో పనులన్నీ ఓ కొలిక్కివచ్చేవి అన్నారు. అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టామని.. మూడు నెలల్లో రోడ్ల పనులు పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నట్లు తెలిపారు. రాబోయే మూడేళ్లలో పరిపాలనకు సంబంధించిన భవనాలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు మంత్రి నారాయణ.

# హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు- 31 మంది మృతి

**లెబనాన్:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు సోమవారం మరింత పెరిగాయి. లెబనాన్‌లో ఇరాన్ మద్దతు ఉన్న హెజ్‌బొల్లా మిలిటెంట్ సంస్థ స్థావరాల లక్ష్యంగా ఇజ్రాయెల్ భీకర దాడులు చేపట్టింది. ఈ దాడుల్లో సుమారు 31 మంది మృతిచెందారు. మరో 149 మంది గాయపడినట్లు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. రాజధాని బీరుట్‌లో పలు భవనాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మృతికి ప్రతీకారంగా హెజ్‌బొల్లా మిలిటెంట్ సంస్థ ఇజ్రాయెల్ సరిహద్దు దిశగా క్షిపణులను ప్రయోగించింది. దీంతో ఇజ్రాయెల్, లెబనాన్‌పై ప్రతి దాడులకు దిగింది. హెజ్బొల్లా నేతలపై లక్ష్యంగా దాడులులెబనాన్ జరిపిన దాడులకు ప్రతిస్పందనగా ఈ చర్యలు చేపట్టినట్లు ఇజ్రాయెల్ వైమానిక దళం (ఐఏఎఫ్) ఎక్స్?లో వరుస పోస్టులు చేసింది. 'కొద్దిసేపటి క్రితం వైమానిక దళం బీరూట్ ప్రాంతంలో హెజ్?బొల్లా ఉగ్ర సంస్థకు చెందిన సీనియర్ ఉగ్రవాదులే లక్ష్యంగా దాడులు చేపట్టాం. అదే సమయంలో, దక్షిణ లెబనాన్‌లో హెజ్?బొల్లా చెందిన ఒక కీలక ఉగ్రవాదిని ఐడీఎఫ్ లక్ష్యంగా చేసుకుంది. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని ఐఏఎఫ్ తెలిపింది. మరో పోస్ట్?లో లెబనాన్ నుంచి ఇజ్రాయెల్ భూభాగంలోకి పలు డ్రోన్లు క్షిపణులు దూసుకొచ్చాయని ఐఏఎఫ్



తెలిపింది. వాటిలో కొన్ని నిర్మానుష్య ప్రాంతాల్లో పడ్డాయని పేర్కొంది. కొన్ని సందర్భాల్లో హెచ్చరిక సైరన్లు మోగించలేదని స్పష్టం చేసింది. ఎలాంటి గాయాలు లేదా ఆస్తి నష్టం జరగలేదని తెలిపింది. ఉత్తర ఇజ్రాయెల్‌లో సైరన్లు మోగింపుమరోవైపు దాడులను ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) ధ్రువీకరించింది. లెబనాన్ అంతటా హెజ్‌బొల్లా లక్ష్యాలపై దాడులు కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. ఇజ్రాయెల్ రాష్ట్రానికి ముప్పు లేదా ఉత్తర ప్రాంత నివాసులకు హాని కలిగించడానికి అనుమతించదని పేర్కొంది. హెజ్‌బొల్లా స్థావరాలపై మరిన్ని దాడులు చేపడతామని ప్రకటించింది. ఇళ్లను ఖాళీ చేసి, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని లెబనాన్‌లోని బెకా లోయలో ఉన్న 50కి పైగా గ్రామాల ప్రజలకు హెచ్చరించింది.'ఉత్తర ఇజ్రాయెల్‌పై దాడులకు ప్రతిస్పందనగా, లెబనాన్ అంతటా హెజ్‌బొల్లా లక్ష్యాలపై ఐడీఎఫ్ దాడులు కొనసాగిస్తోంది. హెజ్‌బొల్లా ఇరాన్ పాలన తరపున పనిచేస్తూ, ఇజ్రాయెల్ పౌరులపై కాల్పులు జరిపి లెబనాన్‌ను విధ్వంస దిశగా నడిపిస్తోంది. ఆపరేషన్ రోరింగ్ లయన్?లో భాగంగా ఇలాంటి పరిస్థితులకు మా బలగాలు సిద్ధమయ్యాయి. అన్ని దిశలుగా జరిగే యుద్ధ పరిస్థితులకు సన్నద్ధంగా ఉన్నాం' అని ఐడీఎఫ్ పోస్టులో పేర్కొంది. లెబనాన్ భూభాగం నుంచి ప్రయోగాలు జరిగిన తరువాత ఉత్తర ఇజ్రాయెల్‌లోని పలు ప్రాంతాల్లో సైరన్లు మోగినట్లు ధృవీకరించింది. పూర్తి వివరాలు పరిశీలనలో ఉన్నాయని వెల్లడించింది. హెజ్?బొల్లా విభాగం ప్రకటనఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతికి ప్రతీకారంగా ఇజ్రాయెల్?పై ?హెజ్‌బొల్లా మిలిటెంట్ సంస్థ దాడులకు దిగింది. ఆదివారం రాత్రి ఇజ్రాయెల్ సరిహద్దు దిశగా క్షిపణులను ప్రయోగించినట్లు అల్? మనార్ నెట్?వర్క్? తెలిపింది. సోమవారం తెల్లవారుజామున ఈ విషయాన్ని వెల్లడించింది. హెజ్‌బొల్లా విభాగం ఈ ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే దక్షిణ బీరుట్‌లోని అనేక గ్రామాలు సహా హెజ్‌బొల్లా స్థావరాలపై ఐడీఎఫ్ విరుచుకుపడింది. ఇంకా ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతునే ఉన్నాయి.

# ముంబై విమానాశ్రయంలో 'గల్ఫ్' సెగ.. విమానాల రద్దుతో ప్రయాణికుల నరక యాతన!



**ముంబై :** ముంబైలో సోమవారం ఛత్రపతి శివాజీ మహరాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో వందలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా గల్ఫ్‌కు వెళ్లాల్సిన అనేక విమానాలను విమానయాన సంస్థలు రద్దు చేశాయి. దీంతో విమానాశ్రయంలో వందల మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడిచిన 24 గంటల్లో ముంబై నుంచి దుబాయ్, కువైట్, మస్కట్, ఖతార్, సౌదీ అరేబియాకు వెళ్లాల్సిన పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి.భద్రతా కారణాల దృష్ట్యా ఎయిర్ ఇండియా తమ సర్వీసులు రద్దు చేసుకోగా, ఇండిగో మార్చి 3 వరకు 200కి పైగా విమానాలను రద్దు చేసింది. ముందస్తు సమాచారం లేకపోవడంతో విమానాశ్రయానికి చేరుకున్న ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. విమానాలు ఎప్పుడు పునరుద్దరిస్తారో తెలియక, ఎయిర్‌లైన్స్ కౌంటర్ల వద్ద ప్రయాణికులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. పసిబిడ్డలు, వృద్దులతో కూడిన కుటుంబాలు విమానాశ్రయ ఫ్లోర్‌లపైనే నిద్రించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడులు చేయడంతో పరిస్థితి ఎప్పుడు చక్కబడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

# నెతన్యాహు, UAE అధ్యక్షుడితో ఫోన్‌లో మాట్లాడిన మోదీ పౌరుల రక్షణ అత్యంత ప్రాధాన్యమని స్పష్టం

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రాంతీయ భద్రత, పౌరుల రక్షణ అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ కీలక దేశాధినేతలతో వరుసగా ఫోన్ సం భాషణలు జరిపారు. ఇజ్రాయెల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నాయకులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితులపై చర్చించి, ఘర్షణలు త్వరగా ముగియాలని భారత్ తరపున స్పష్టం చేశారు.శాంతి దిశగా చర్యలు చేపట్టాలన్న మోదీముందుగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో మోదీ ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమా సియాలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై భారత్ ఆందో ళనలను వ్యక్తం చేశారు. ముఖ్యంగా యుద్ధ వాతావరణంలో సాధారణ ప్రజలే ఎక్కువగా నష్టపోతారని, కాబట్టి పౌరుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలాగే శత్రుత్వ చర్యలను వీలైనంత త్వరగా నిలిపివేసి శాంతి దిశగా చర్యలు చేపట్టాలని పునరుద్ఘాటించారు.ఈ విషయాన్ని మోదీ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో వెల్లడించారు. "ప్రస్తుత ప్రాం తీయ పరిస్థితులపై చర్చించాం. తాజా పరిణామాలపై భారత ఆందోళనను తెలియజేశాం. పౌరుల రక్షణ అత్యంత ముఖ్యమని చెప్పాం. శత్రుత్వానికి త్వరగా ముగింపు పలకాలి" అని ఆయన పేర్కొన్నారు.యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడితో మోదీ ఫోన్‌ఇదిలా ఉండగా, అమెరికా-- ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై క్షిపణి దాడులు చేపట్టిన తర్వాత పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. ప్రతీకారంగా ఇరాన్ పలు ప్రాంతాలపై



దాడులు చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా గల్ఫ్ దేశాలపై డ్రోన్లు, క్షిపణి దాడులు జరగడంతో అక్కడ నివసిస్తున్న భారతీయుల భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్తో కూడా మోదీ ఫోన్‌లో మాట్లాడారు. యూఏఈపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలిపారు. కష్టకాలంలో యూఏఈకి భారత్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.యూఏఈలో లక్షలాది మంది భారతీయులు నివసిస్తున్న నేపథ్యంలో వారి రక్షణకు ఆ దేశ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ధన్యవాదాలు తెలిపారు. "భారతీయుల భద్రతకు తీసుకుంటున్న చర్యలకు కృతజ్ఞతలు. ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి భారత్ మద్దతిస్తుంది" అని మోదీ పేర్కొన్నారు.గత రెండు రోజులుగా యూఏఈపై ఇరాన్ జరిపిన దాడుల్లో ముగ్గురు మృతి చెందగా, దాదాపు 58 మంది గాయపడినట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. క్షతగాత్రుల్లో ఒక భారతీయుడు కూడా ఉన్నట్లు సమాచారం. దీంతో భారత రాయబార కార్యాలయం అప్రమత్తమై, అక్కడి భారతీయులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తోంది. అవసరమైన సహాయం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్‌లు కూడా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.ఇక దేశ భద్రతా పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం కూడా సమీక్ష చేపట్టింది. ప్రధాని మోదీ అధ్యక్షతన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశంలో పశ్చిమాసియా పరిణామాలు, భారత ప్రయోజనాలు, విదేశాల్లోని భారతీయుల భద్రత, చమురు సరఫరాలు, వ్యూహాత్మక అంశాలపై చర్చించినట్లు సమాచారం. ప్రాంతీయ ఉద్రిక్తతలు భారత్‌పై ఎలాంటి ప్రభావం చూపవచ్చో సమగ్రంగా విశ్లేషించారు. పశ్చిమాసియాలో శాంతి భద్రతలు క్షీణిస్తే గ్లోబల్ మార్కెట్లపై, ముఖ్యంగా చమురు ధరలపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇది భారత ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపవచ్చని నిపుణులు చెబుతున్నారు. అందుకే పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తూ, అవసరమైతే తక్షణ చర్యలు తీసుకునే ందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మొత్తం మీద పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో భారత్ సమతుల్య దౌత్య విధానాన్ని అవలంబిస్తోంది. అన్ని పక్షాలతో చేస్తోంది. ఘర్షణలు కాకుండా చర్చల ద్వారానే సమస్యలకు పరిష్కారం కనుగొనాలని భారత్ స్పష్టమైన సందేశం ఇస్తోంది. ప్రాంతీయ శాంతి, పౌరుల రక్షణే తమ ప్రధాన లక్ష్యమని ప్రధాని మోదీ తాజా సంభాషణలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి.

# ఢిల్లీలో పాఠశాలలకు బాంబు బెదిరింపులు

**ఢిల్లీ, మార్చి 2 :** దేశ రాజధాని ఢిల్లీలో పలు పాఠశాలలకు (సోమవారం) బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ బెదిరింపులతో వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇమెయిల్ ద్వారా పాఠశాలలలో బాంబులు పెట్టినట్లు హెచ్చరికలు పంపించారు. ముఖ్యంగా మయూర్ విహార్ ప్రాంతంలోని సాల్వాన్ పబ్లిక్ స్కూల్ తో పాటు పలు స్కూళ్లకు వచ్చిన బెదిరింపులు తీవ్ర ఆందోళనకు కారణమైంది.ఇమెయిల్ ద్వారా బెదిరింపులు..పాఠశాల యాజమాన్యానికి వచ్చిన ఇమెయిల్‌లో స్కూల్ ప్రాంగణంలో బాంబు పెట్టినట్లు ఆగంతకులు పేర్కొన్నారు. ఈ సమాచారం అందుకున్న వెంటనే పాఠశాల సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. విద్యార్థులు, సిబ్బందిని వెంటనే అప్రమత్తం చేసి పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.రంగంలోకి దిగిన డాగ్ స్క్వాడ్..సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాంబు డిస్పోజల్ టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది సహాయంతో పాఠశాల మొత్తం తనిఖీలు నిర్వహించారు. ప్రతి తరగతి గది, ప్రాంగణం, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రమంలో పాఠశాల పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు మరింత కట్టుదిట్టం చేశారు.బాంబు లేదని తేల్చిన పోలీసులు..విస్తృత తనిఖీల అనంతరం ఎలాంటి అనుమానాస్పద వస్తువులు గుర్తించలేదని పోలీసులు వెల్లడించారు. ఇది తప్పుడు బెదిరింపు అయ్యి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఇమెయిల్ పంపిన వ్యక్తిని గుర్తించేందుకు పోలీసులు సైబర్ క్రైమ్ విభాగంతో కలిసి దర్యాప్తు ప్రారంభించారు.తల్లిదండ్రుల్లో ఆందోళన..ఈ ఘటనతోవిద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. పిల్లల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ స్కూల్ యాజమాన్యాన్ని సంప్రదించారు. అధికారులు మాత్రం పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉందని, భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు.భద్రతా చర్యలు కట్టుదిట్టం..ఈ ఘటన నేపథ్యంలో ఢిల్లీలోని పాఠశాలల వద్ద భద్రతను మరింత పెంచారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.




# ఆయుధాలు వదిలేసిన వారికి రక్షణ కల్పిస్తాం.. ట్రంప్ ఆఫర్

**న్యూయార్క్, మార్చి 2:** సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారం తీర్చుకోవడమే లక్ష్యంగా ఇరాన్ ముందుకు సాగుతోంది. అమెరికా, ఇజ్రాయెల్‌పై భీకర దాడులకు దిగుతోంది. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై దాడులు చేస్తోంది. యూఏఈలోని అమెజాన్ డేటా సెంటర్‌పై ఇరాన్ దాడులు చేసింది. ఈ నేపథ్యంలోనే ఇరాన్‌కు చెందిన 506 డ్రోన్లు, 152 మిస్సైల్స్‌ను యూఏఈ కూల్చేసింది. కువైట్‌పై ఇరాన్ 97 మిస్సైల్స్, 283 డ్రోన్లను ప్రయోగించింది. ఈ దాడిలో ఒకరు మృతి చెందగా.. 30 మందికి గాయాలు అయ్యాయి. ఇరాన్ ప్రయోగించిన 45 మిస్సైల్స్, 9 డ్రోన్లను బహ్రెయిన్ కూల్చేసింది.ఇరాన్ ఐఆర్‌జీసీ, మిలిటరీ దళాలకు ట్రంప్ ఆఫర్అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ),



మిలిటరీ దళాలకు ఆఫర్ ఇచ్చారు. ఆయుధాలు వదిలేసిన వారికి రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. లేకపోతే చావు తప్పదని ఆయన హెచ్చరించారు. యుద్ధం నాలుగు వారాలపాటు జరగొచ్చని అన్నారు. తమ దళాలు జరిపిన దాడుల్లో 48 మంది ఇరాన్ నేతలు చనిపోయారని ఆయన వెల్లడించారు. ఇరాన్‌తో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.కాగా, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ)కు చెందిన ప్రధాన కార్యాలయంపై యూఎస్ సెంట్రల్ కమాండ్ దాడులు చేసింది. ఈ దాడుల్లో కార్యాలయం ధ్వంసం అయినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. గత 47 ఏళ్లలో ఐఆర్‌జీసీ దళాలు వెయ్యి మందికిపైగా అమెరికన్లను హతమార్చాయని ఎక్స్‌లో పోస్టు పెట్టింది. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ కేంద్రాలను ధ్వంసం చేశామని తెలిపింది. ఇరాన్‌కు చెందిన యుద్ధవిమానాలను కూడా ధ్వంసం చేశామని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.

# ఇక అమెరికాతో చర్చలు జరిపే ప్రసక్తే లేదు'- ఇరాన్ కీలక ప్రకటన

**ఇరాన్ :** ఇజ్రాయెల్ – అమెరికాతో సైనిక ఘర్షణ వేళ ఇరాన్ కీలక ప్రకటన విడుదల చేసింది. ఇక అమెరికాతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని ఇరాన్ ప్రభుత్వ అత్యున్నత స్థాయి భద్రతా వ్యవహారాల అధికారి అలీ లారిజానీ వెల్లడించారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. మరోవైపు సోమవారం ఉదయం నుంచి ఇరాన్ సమర్థిత మిలిటెంట్ గ్రూపులు కూడా అరబ్ దేశాలు, ఇజ్రాయెల్‌తో పాటు అమెరికా సైనిక స్థావరాలపై దాడులు మొదలుపెట్టాయి. డ్రోన్లు, మిస్సైళ్లతో అవి ఎటాక్స్ చేస్తున్నాయి. మిడిల్ ఈస్ట్ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాల్లో ఉన్న సైనికులను టార్గెట్‌గా చేసుకొని తమ దాడులను కొనసాగిస్తామనే హెచ్చరికలను ఇరాన్ సమర్థిత మిలిటెంట్ గ్రూపులు జారీ చేశాయి. ఇరాన్‌పైనా అమెరికా – ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. ఈ దాడులకు ప్రతిగా ఇరాన్ సైతం ప్రతిదాడులను చేస్తోంది.యుద్ధంలోకి ఎంట్రీ ఇస్తాం : గల్ఫ్, ఐరోపా దేశాలుఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాలు కీలక ప్రకటన విడుదల చేశాయి. ఇరాన్ చేస్తున్న దాడులకు తాము కలిసికట్టుగా సరైన సమాధానం ఇస్తామని వెల్లడించాయి. ఈ యుద్ధంలో అమెరికాతో కలిసి పనిచేసేందుకు తాము సిద్ధమని బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ ప్రకటించాయి. ఇరాన్‌ను నిలువరించేందుకు అమెరికాకు తమ వంతు సాయాన్ని అందిస్తామని అవి వెల్లడించాయి. ఇరాన్ పూర్తి నిర్లక్ష్యంగా అన్ని అరబ్ దేశాలపై దాడులు చేస్తోందని ఆ మూడు ఐరోపా దేశాలు ఆరోపించాయి. కువైట్‌లోని అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ జరిపిన దాడిలో ముగ్గురు అమెరికన్ సైనికులు చనిపోయారు. ఈ మరణాలకు ప్రతీకారం తీర్చుకుంటామని ట్రంప్ ప్రతిజ్ఞ చేశారు. ఈవిధంగా సైనిక ఘర్షణతో యావత్ పశ్చిమాసియా ప్రాంతం అట్టుడుకుతోంది. అరబ్, ఐరోపా దేశాలు కూడా ఈ యుద్ధంలోకి ప్రవేశిస్తే, సైనిక ఘర్షణ పరిధి మరింత పెరుగుతోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



# గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన వేలాదిమంది భారతీయులు- వారి భద్రతపై ఆందోళనలు- తీసుకొచ్చేందుకు కేంద్రం కసరత్తు


**న్యూఢిల్లీ:** ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ సైనిక ఘర్షణ నేపథ్యంలో చాలా పశ్చిమాసియా దేశాలు తమ గగనతలాన్ని మూసివేశాయి. ఈ జాబితాలో ఇరాన్, ఇజ్రాయెల్‌తో పాటు ఇరాక్, సిరియా, ఖతర్, బహ్రెయిన్, కువైట్ ఉన్నాయి. ఇక పాక్షికంగా గగనతలాన్ని మూ సివేసిన దేశాల లిస్టులో యూఏఈ, సౌదీ అరేబియా, జోర్డాన్ ఉన్నాయి. ఇరాన్, ఇరాన్ సమర్థిత మిలిటెంట్లు అరబ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలతో పాటు ఎయిర్ పోర్టులు, హోట ళ్లపైనా డ్రోన్లు, మిస్సైళ్లతో దాడులు చేస్తున్నారు. దీంతో దుబాయ్, అబుదాబి, దోహా సహా గల్ఫ్ దేశాల్లోని చాలా ఎయిర్‌పోర్టులను మూసివేశారు. 1,000కిపైగా విమాన సర్వీసులను రద్దు చేశారు. దీనివల్ల ప్రతిరోజు సగటున 90వేల మంది ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ నేపథ్యంలో వేలాది మంది భారతీయులు గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయారు. వీరిలో ఉద్యోగాలు చేస్తున్నవారు, టెక్ నిపుణులు, విద్యార్థులు, పర్యాటకులు ఉన్నారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో యుద్ధం విస్తరిస్తున్న తరుణంలో అక్కడున్న భారతీయుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.కర్ణాటక ముందడుగు!మిడిల్ ఈస్ట్ దేశాల్లోని భారతీయుల భద్రత అంశాన్ని తొలుత కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన రాష్ట్రాల్లో కర్ణాటక ఒకటి. దీనిపై భారత విదేశాంగ శాఖ, పౌర విమానయాన శాఖలకు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి షాలిని రజనీశ్ వివరణాత్మక నివేదికను అందించారు. ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లో ఉన్న పరిస్థితులు, అక్కడి భారతీయుల భద్రతను ప్రశ్నార్థకంగా మారుస్తున్న అంశాన్ని అందులో హైలైట్ చేశారు. కర్ణాటక రాష్ట్ర సర్కారు తన అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థను ఇప్పటికే యాక్టివేట్ చేసిందని కేంద్రానికి తెలిపారు. రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రం ద్వారా 24 గంటల హెల్ప్ లైన్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఎయిర్‌లిఫ్ట్ ఆపరేషన్ ప్రారంభించాలి!" ఇరాన్‌పై అమెరికా – ఇజ్రాయెల్ దాడుల తరువాత మిడిల్ ఈస్ట్‌లో సైనిక ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి.



దీంతో గల్ఫ్ దేశాల్లో ఉన్న పంజాబీలు, భారతీయుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. చాలామంది భారతీయులు అక్కడ చిక్కుకుపో యారు. వాళ్లను వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకురావాలి. ఈదిశగా చొరవ చూపాలని నేను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేస్తున్నాను. విమాన మార్గాలను తిరిగి తెరిచిన వెంటనే, భారతీయ పౌరులను సురక్షితంగా ఇండియాకు తీసుకురావడా నికి ప్రత్యేక ఎయిర్‌లిఫ్ట్ ఆపరేషన్ ప్రారంభించాలని కోరు తున్నాను" అని పంజాబ్‌కు చెందిన శిరోమణి అకాలీదళ్ అధ్యక్ష ుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ పేర్కొన్నారు.కేంద్రాన్ని సాయం కోరాం : కేరళ"మిడిల్ ఈస్ట్‌లోని చాలా దేశాల్లో ఎయిర్ పోర్టుల ను మూసివేశారు. దీంతో అజర్‌బైజాన్ నుంచి షార్జా మీదుగా కువైట్‌కు వెళ్లాల్సిన ఒక విమానం కరాచీ విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. ఆ విమానంలో కేరళలోని పాలక్కడ్‌కు చెందిన ఒక కుటుంబం సహా మొత్తం ఎనిమిది మంది భారతీయులు ఉన్నారు. దీనిపై మేం భారత విదేశాంగ శాఖతో సంప్రదింపులు జరిపాం. ఆ విమానంలోని భారతీయులను సురక్షితంగా తిరిగి తీసుకురావాలని కోరాం. కొలంబో మార్గం ద్వారా వారిని కేరళకు చేర్చాలని విన్నవిం చాం" అని కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ప్రవాస భారతీయుల సంక్షేమ విభాగం వెల్లడించింది.భారత ప్రభుత్వం ఏం చేస్తోంది?మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో భారత ప్రధాని మోదీ మాట్లాడారు. ఈవివరాలతో ఒక ప్రకటనను భారత ప్రధానమంత్రి విడుదల చేశారు. ఈ క్లిష్ట సమయాల్లో యూఏఈకి భారతదేశం సంఘీభావంగా నిలుస్తుం దన్నారు. చెప్పారు. ఈ దాడుల వల్ల జరిగిన ప్రాణనష్టానికి మోదీ సంతాపం తెలిపారు. ఈ ఉద్రిక్త తలను తగ్గించడం, ప్రాంతీయ శాంతి, భద్రత, స్థిరత్వానికి మద్దతు ఇస్తామని వెల్లడించారు.భారతీయులను తీసుకురా వడంపై చర్చలు"ప్రస్తుతం మిడిల్ ఈస్ట్‌లో పరిస్థితి అస్థిరంగా, ఆందోళనకరంగా ఉంది. ఇలాంటప్పుడు విమాన సర్వీసుల రాకపోకలు ముప్పును కలిగిస్తాయి. అయితే, గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా తిరిగి తీసుకురావడంపై మేం దృష్టి సారించాం. దీనిపై అత్యున్నత స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. తప్పకుండా ప్రవాస భారతీయులకు ప్రభుత్వం మద్దతను అందిస్తుంది" అని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు.భారతీయ పౌరులకు సహాయం చేయడానికి చర్యలు : భద్రతా కేబినెట్ కమిటీమిడిల్ ఈస్ట్‌లో సైనిక ఘర్షణ, భారతీయ పౌరుల భద్రతపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన భద్రతా కేబినెట్ కమిటీ (సీసీఎస్) సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. గల్ఫ్ దేశాల్లోని భారతీయుల భద్రతపై ఈ కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

# ఆయిల్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి.. భారతీయ మెరైన్ మృతి

**మస్కట్:** ఒమన్ తీరంలో ఆయిల్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి జరిగింది. ఆయిల్ ట్యాంకర్‌లో మంటలు చెలరేగాయి. ఈ దాడిలో భారతీయుడైన మెరైన్ సిబ్బంది మరణించినట్లు ఒమన్ ధృవీకరించింది. ఆయిల్ ట్యాంకర్‌లోని మిగతా సిబ్బందిని రెస్క్యూ చేసినట్లు పేర్కొంది. అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడులకు ఇరాన్ ధీటుగా స్పందిస్తున్నది. ప్రతిదాడులకు పాల్పడుతున్నది. ఈ నేపథ్యంలో ఒమన్ సముద్ర జలాల్లో ఉన్న మార్షల్ దీవులకు చెందిన ఆయిల్ ట్యాంకర్ ఎంకేడీ వియోమ్‌పై మార్చి1న డ్రోన్ దాడి జరిగింది. ప్రధాన ఇంజిన్ గదిలో పేలుడు సంభవించడంతో మంటలు చెలరేగాయి.కాగా, ఆ ఆయిల్ ట్యాంకర్‌లో 21 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 16 మంది భారతీయులు, నలుగురు బంగ్లాదేశీయులు, ఒకరు ఉక్రేనియన్. అయితే డ్రోన్ బాంబు దాడి వల్ల జరిగిన పేలుడులో భారత్‌కు చెందిన ఒక మెరైన్ సిబ్బంది మరణించినట్లు ఒమన్ అధికారులు సోమవారం ధృవీకరించారు. ప్రాణాలతో బయటపడిన మిగతా వారిని పనామాకు చెందిన కార్గో షిప్‌లోకి తరలించినట్లు వెల్లడించారు.



మంగళవారం,
మార్చి 03, 2026
భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక



# అనిశ్చితిలో ఇరాన్ భవితవ్యం



అమెరికా యుద్ధ దాహానికి ప్రపంచం వణుకుతోంది. బడిత ఉన్నోడిదే బర్రె అన్నచందంగా అమెరికా తన ఆయుధాలతో ప్రపంచాన్ని బెదిరిస్తోంది. దారికి రాని వారిపై దాడికి తెగిస్తోంది. మొన్న వెనిజువెలా, ఇప్పుడు ఇరాన్ దేశాలు దెబ్బతిన్నాయి. ప్రపంచ దేశాల్లో అస్థిరతను సృష్టించడం, తమ దారికి తెచ్చుకోవడం అలవాటుగా చేసుకుంది. ఆయుధాలు లేదా, సుంకాలతో బెదిరిస్తోంది. భారత్‌ను కూడా ఇదే తరహాలో ఇబ్బందులు పెడుతోంది. తాజా యుద్ధంతో భారత్ తన వ్యూహాలను మార్చుకోవాలి. స్వతహాగా ఆలోచన చేయాలి. గతంలో ఇరాక్‌ను ధ్వంసం చేసిన అమెరికా ఇప్పుడు ఇరాన్‌ను తుదముట్టిం చింది. రేపు ఎవరన్న ప్రశ్న ఉదయిస్తోంది. ఇది నయా నియంతల కాలంగా మారింది. ఓ వైపు అమెరికా, మరోవైపు ఇజ్రాయిల్ కలసి ఆడుతున్న యుద్ధంలో ప్రపంచ దేశాలకు వణుకు పుట్టేలా ఉంది. అయితే ఇరాన్ కూడా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా హమాస్, హిజ్బుల్ సంస్థలను ప్రోత్సహించి ఇజ్రాయిల్ పతనాన్ని కోరుకుంది. ఇరాన్‌ను అభివృద్ధి చేసుకునే పనిని వదిలి ఇజ్రయిల్‌తో పంతం పెట్టుకుంది. అణు కార్యక్రమాలను విస్తరించుకుంది. అదే ఇప్పుడు ఖమేనీ పతనానికి దారితీసింది. దశాబ్దాల పాటు తిరుగులేని రీతిలో ఇరాన్‌ను శాసించిన అగ్ర నాయకుడు ఖమేనీ..ప్రత్యర్థి దాడిలో సులువుగా ప్రాణాలు కోల్పోవడం ఆశ్చర్యపరయడం లేదు. ఎందుకంటే కొన్ని నెలలుగా ఖమేనీ కదలికలపై దృష్టి పెట్టిన అమెరికా, ఇజ్రాయెల్ మట్టుపెట్ట గలిగాయి. ఆధునిక సాంకేతికతతో ఖమేని ప్రాంతాన్ని గుర్తించి దాడి చేసారు. అమెరికా దాడులు దాదాపు ఖాయమని కొద్ది రోజులుగా స్పష్టమవుతున్నా ఆయనను సురక్షితంగా ఉంచడంలో అక్కడి అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అయ్యింది. అమెరికా అందించిన రహస్య సమాచారం ఆధారంగా ఇజ్రాయెల్.. శనివారం మెరుపు వేగంతో స్పందించి దాడికి దిగడంతో తప్పించుకోవడానికి ఖమేనీకి అవకాశం దక్కలేదు. తమ అణు కేంద్రాలను తొలుత లక్ష్యంగా చేసుకోవచ్చని ఇరాన్ నిఘా వర్గాలు భావించాయి. కానీ తొలి దాడి నేరుగా ఖమేనీపైనే జరుగుతుందని ఊహించలేకపోయాయి. ఈ క్రమంలో ఇరాన్ భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ఇరాన్ తన ఛాందసవాద పంథాను వీడాలి. ఉగ్రవాదులను ప్రోత్సహించి, ఇతర దేశాలపై పురిగొల్పే విధానాల నుంచి తప్పుకోవాలి. ప్రజలంతా ఎవరికి తోచినట్లు వారు బతికేలా చేసుకోవాలి. పాకిస్తాన్ కూడా ఇలాగే ఉగ్రవాదులను ఎగదోస్తూ వచ్చింది. చివరకు సహనం నశించిన భారత్ ఆపరేషన్ సిందూర్‌తో దాడులు చేసింది. అయితే చావుతప్పి కన్ను లొట్టపోయి నట్లుగా ఇప్పుడు పాక్ పరిస్థితి మారింది. అఫ్గాన్తో కయ్యానికి దిగింది. ఇది దేశాన్ని అతలాకుతలం చేస్తుందన్న విషయం గుర్తించడం లేదు. ఇక ఇరాన్ కూడా ఛాందసవాద భావాలతో రగిలిపోతోంది. ఖమేనీ రాకతో ఇరాన్ మళ్లీ మతఛాందసవాదంలోకి నెట్టబడింది. అక్కడ ప్రజలు ఇటీవలే ఖమేనీ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ప్రభుత్వ దాడుల్లో వేలాదిమంది హతం అయ్యారు. అంతర్గతంగా కూడా ఇరాన్ నాయకత్వం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో అమెరికా కూడా పాచిక వేసి ఖమేనీని మట్టు పెట్టింది. గత ఏడాది ఇరాన్‌లోని అణు స్థావరాలపై దాడికి సన్నద్ధమవుతున్న తరుణంలోనే.. ఖమేనీ ఎక్కడ దాగున్నారో తమకు తెలుసని, కావాలనుకుంటే ఆయనను చంపగలిగి ఉండేవారమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. నాటి నుంచి ఈ పటిష్ట నిఘా నెట్‌వర్క్‌ను అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏ కొనసాగించింది. గత ఏడాది 12 రోజుల యుద్ధం సమయంలోనే ఖమేనీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ దళం మధ్య కమ్యూనికేషన్ సాగుతున్న తీరు, అత్యవసర సమయాల్లో వారు చేపడుతున్న చర్యల గురించి మరింత ఎక్కువగా తెలుసుకుంది. ఆ సమాచారం ఆధారంగా తన నిఘా సామర్థ్యానికి సీఐఏ పదును పెట్టింది. తద్వారా.. ఖమేనీ కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించడం, తదుపరి అడుగుల గురించి మరింత కచ్చితత్వంతో అంచనాలు వేయగలిగే సత్తాను సాధించింది. ఖమేనీ కదలికలపై అత్యంత విశ్వసనీయ సమాచారాన్ని సీఐఏ.. ఇజ్రాయెల్‌తో పంచుకుంది. ఆ వెంటనే ఇంటెలిజెన్స్, సైనిక ప్రణాళికపై కసరత్తు మొదలైంది. ఖమేనీ భేటీ శనివారం సాయంత్రం ఉండొచ్చని తొలుత అమెరికా, ఇజ్రాయెల్ దళాలు భావించాయి. అయితే ఆ సమావేశం ఉదయమే జరుగుతున్నట్లు చివరి నిమిషంలో ఇజ్రాయెల్ నిఘా అధికారులకు సమాచారం అందింది. దీంతో శనివారం ఉదయమే టెహ్రాన్‌పై విరుచుకుపడాలని నిర్ణయించు కున్నారు. ఖమేనీపై దాడితో యుద్ధాన్ని ప్రారంభించాలని తీర్మానించుకున్నారు. పోరు మొదలయ్యాక ఆయన బంకర్‌లో తలదాచుకోవచ్చన్న భావనకు అమెరికా, ఇజ్రాయెల్‌లు వచ్చాయి. ఆ సమయంలో ఇరాన్ జాతీయ భద్రతా అధికారులు ఒక భవనంలో.. ఖమేనీ మరో భవనంలో ఉన్నారు. అయినా ఇరాన్ సుప్రీం నేత నిర్దిష్ట ప్రదేశాన్ని గుర్తించిన జెట్‌లు అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశాయి. ఖమేనీ ప్రాంగణం ధ్వంసమైనట్లు ఉపగ్రహ చిత్రాలు నిర్ధారించాయి. దానిపై 30 బాంబులను ప్రయోగించి నట్లు తెలుస్తోంది. ఖమేనీపై దాడికి శక్తిమంతమైన 'బంకర్ బస్టర్' బాంబులను కూడా వాడినట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు భవిష్యత్ ఏంటన్నది ఇరాన్ ఆలోచించాలి. ఇరాక్ పతనమైనట్లే ఇరాన్ కూడా పతనమవుతుందా లేక లేచి నిలబడుతుందా అన్నది చూడాలి. ఆయుధ పోటీలో ఇప్పుడు ఈ యుద్ధం పరాకష్టగా చూడాలి. ఇరాన్ ప్రజలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న ఆలోన తదుపరి నాయకత్వం చేయాలి. ప్రపంచ దేశాల్లో తనకుంటూ స్థానాన్ని పదిలం చేసుకోవాలి. ఎందుకంటే ఆయతుల్లా అలీ ఖమేనీ మరణం ఇరాన్‌కు భారీ దెబ్బ! 37 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న ఆయన సేవలను కోల్పోవడంతో టెహ్రాన్ ప్రస్తుతం కొంత ఉక్కిరిబిక్కిరి అవుతుందనడంలో సందేహం లేదు. అయితే- ఖమేనీ కన్నుమూసినంత మాత్రాన.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశిస్తున్నట్లుగా ఇరాన్‌లో ఇప్పటికిప్పుడు అధికార మార్పిడి జరిగే అవకాశాలు మాత్రం లేవు! సుప్రీం లీడర్ లేకపోయినా పాలనా వ్యవహారాలు సజావుగా సాగేందుకు అవసరమైన వ్యవస్థ అందుబాటులో ఉండటం, కొత్త పాలకుడి నియామకానికి స్పష్టమైన మార్గనిర్దేశకాలు ఉండటమే అందుకు కారణం. ఖమేనీ మరణంతో ఇప్పటికే ఈ మండలి చేతుల్లోకి ఇరాన్ పాలనా బాధ్యతలు వెళ్లాయి. ఇందులో దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, న్యాయ వ్యవస్థ అధిపతి ఘొలామ్ హుసేన్ మొహ్‌సెనీ ఎజెహీలకు తోడు తృతీయ సభ్యుడిగా ఆయతుల్లా అలీ రెజా అరాఫీ ప్రస్తుతం ఎంపికయ్యారు. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం వచ్చింది. అప్పుడు సుప్రీం లీడర్‌గా ఆయతుల్లా రూహుల్లా ఖొమైనీ నియమితులయ్యారు. 1989లో ఆయన చనిపోయాక.. ఖమేనీకి ఆ పదవి దక్కింది. ఖమేనీ కుమారులలో ఒకరైన 56 ఏళ్ల ముజ్తబా ఖమేనీ ప్రస్తుతం దేశాధినేత అవుతారనే ప్రచారం జరుగుతోంది. గతంలో ప్రభుత్వ పదవిని నిర్వహించిన అనుభవమేదీ ముజ్తబాకు లేదు. ఆయన్ను సుప్రీం లీడర్‌గా నియమిస్తే మతపెద్దల కమిటీపై దేశ ప్రజల్లో ఆగ్రహం పెరగొచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించడం మత సిద్ధాంతాలకు విరుద్ధమని కూడా పలువురు చెబుతున్నారు. ఇకపోతే తరిఉగుబాటు చేయాలన్న ట్రంప్ సూచనలను ఇరాన్ ప్రజలు అంగీకరించరు. కాబట్టి ప్రస్తుతం అమెరికాను విశ్వసించి ఇరాన్‌వాసులు తిరుగుబాటు చేసే అవకాశాలు లేనట్టే! కొత్త నాయకత్వం ఎవరికి దక్కినా ఇరాన్ పునర్నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగాలి.



# ఈ యుద్ధం మరో నాలుగైదు వారాలు జరగొచ్చు

**• అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన**

**వాషింగ్టన్,మార్చి1:** ఇరాన్‌తో యుద్ధం మరో నాలుగు, ఐదు వారాలు జరగొచ్చని, ఆ యుద్ధం ముగిసేలోపు మరింత మంది ఎక్కువ అమెరికా సైనికులు మృతి చెందే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' మరికొద్ది రోజుల పాటు పూర్తి స్థాయిలో కొనసాగుతుందన్నారు. అలాగే అమెరికా సైనికుల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఈ ఆపరేషన్‌లో ఇప్పటివరకు ముగ్గురు అమెరికా సైనికులు మృతి చెందారు. మా సైనికుల మృతికి కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటాం. యుద్ధం ముగిసేలోపు మరింత మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయే అవకాశముంది. అయినా ముందుకే వెళ్తాం. ఈ దాడుల వల్ల ఇరాన్‌లో 200 మంది మరణించినట్టు తెలిసింది. ఇరాన్ ఐఆర్‌జీసీ, మిలిటరీ దళాలు ఆయుధాలు వీడితే వారికి రక్షణ కల్పించేందుకు సిద్ధం. లేదంటే వారికి చావు తప్పదు. అలాగే చర్చల కోసం మా దౌత్య మార్గాలు ఇప్పటికీ తెరిచే ఉన్నాయి' అని ట్రంప్ పేర్కొన్నారు . అలాగే తనపై జరిగిన హత్యాయత్నాల గురించి కూడా ట్రంప్ స్పందించారు. 'ఖమేనీ ప్రోద్భలంతో నాపై ఇప్పటికి రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయి. అయితే, నేను మొదటి ప్రయత్నంలోనే అతడి కథను ముగించా. నన్ను పట్టుకోకముందే, నేను అతడిని పట్టుకున్నా. ఇరాన్‌పై విస్తృత స్థాయిలో దాడులు జరుపుతున్నాం. ఆ ఆపరేషన్ 4-5 వారాలు కొనసాగొచ్చు. యుద్ధ తీవ్రతను ఇదే విధంగా కొనసాగించడం అమెరికా, ఇజ్రాయెల్‌కు పెద్ద కష్టం కాదు' అని ట్రంప్ పేర్కొన్నారు.

# కువైట్‌లో కూలిన అమెరికన్ ఫైటర్ జెట్

**తామే కూల్చామని ఇరాన్ ప్రకటన**

**కువైట్,మార్చి1:** అమెరికా సైనిక యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు ఇరాన్ తెలిపింది. అమెరికా ఎఫ్-15 యుద్ధ విమానం కువైట్ గగనతలంలో కూలిపోయింది. విమానం కూలిపోయే ముందు పైలట్ విమానంలో నుండి బయటకు వెళ్లాడని అంతర్జాతీయ మీడియా నివేదిస్తోంది. పైలట్ స్వల్పంగా గాయపడినట్లు సమాచారం. విమాన ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు విడుదలయ్యాయి. విమానం మంటల్లో చిక్కుకుని పడిపోతున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. ఇరాన్ ఒకేసారి ఇజ్రాయిల్, గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా వైమానిక స్థావరాలపై క్షిపణులను ప్రయోగించడం ద్వారా తన దాడులను కొనసాగిస్తోంది. కువైట్ ఇంటిగ్రేటెడ్ పెట్రోలియం ఇండస్ట్రీస్ కంపెనీ సోమవారం విమానం శిథిలాలు మినా అల్ అహ్మది శుద్ధి కర్మాగారంలోకి పడ్డాయని ధృవీకరించింది. ఇద్దరు కార్మికులు గాయపడ్డారని కిపిక్ తెలిపింది. ఈ ప్రాంతంలో మోహరించిన ఎంఐఎం-104 పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థ ద్వారా విమానం ప్రమాదవశాత్తూ కూలిపోయిందని అనుమానిస్తున్నారు. పేట్రియాట్ అనేది బాలిస్టిక్ క్షిపణులు, శత్రు విమానాలను కూల్చివేసేందుకు సాధారణంగా ఉపయోగించే అధునాతన వ్యవస్థ.




ఇజ్రాయెల్‌తో పాటు అమెరికా వైమానిక స్థావరాలున్న గల్ఫ్ దేశాలపై కూడా క్షిపణి దాడులకు దిగింది. యూఏఈ, కువైట్, బహ్రెయిన్, ఖతార్ తదితర దేశాల్లోని అమెరికా బేస్‌లపై దాడులు చేసింది. కాగా, సోమవారం శత్రు దేశానికి చెందిన ఓ ఫైటర్ జెట్‌ను కూల్చివేసినట్టు ఇరాన్ ప్రకటించింది. కువైట్ గగనతలంలో ఎగురుతున్న ఒక ఎఫ్-15 ఫైటర్ జెట్‌ను తమ క్షిపణి వ్యవస్థతో కూల్చివేసినట్లు వెల్లడించింది. దీనికి సంబంధించిన వీడియోను కూడా ఇరాన్ విడుదల చేసింది. వైరల్ అవుతున్న ఆ వీడియో ప్రకారం.. ఓ యుద్ధ విమానం మంటల్లో చిక్కుకుని నెమ్మదిగా కిందకు పడిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అయితే ఈ విమానం అమెరికాదా లేక ఇజ్రాయెల్‌దా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. పైలట్లు ఇద్దరు పారాచూట్ల సాయంతో క్షేమంగా బయటపడినట్లు వార్తలు వస్తున్నాయి. అలాగే, ఈ యుద్ధం ఆపేందుకు మధ్యవర్తులతో ఇరాన్ సంప్రదింపులు జరుపుతోందంటూ వస్తున్న వార్తలను ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీ ఖండించారు. అమెరికాతో చర్చల ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఇరాన్, అమెరికా మద్దతు కలిగిన ఇజ్రాయెల్ మధ్య దాడులు, ప్రతిదాడులు మూడో రోజుకు చేరుకున్నాయి. యుద్ధం ప్రారంభమైన మొదటి రోజే ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఖమేనీ మృతికి ప్రతీకారంగా ఇరాన్ కూడా దాడులు ప్రారంభించింది

# కొనసాగిన ఇజ్రాయిల్ దాడులు

**బాంబు దాడిలో ధ్వంసమైన గాంధీ ఆస్పత్రి**

**165కు చేరుకున్న పాఠశాల దాడి మృతులు**

**టెహ్రాన్,మార్చి1:** అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ రోరింగ్ లయన్' లో భాగంగా సోమవారం తెల్లవారుజామున ఉత్తర టెహ్రాన్‌లో ఉన్న గాంధీ హాస్పిటల్ పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపింది. ఈ దాడిలో భవనం చాలా వరకు దెబ్బతింది. బాంబుల తాకిడికి కిటికీలు పగిలిపోయి, వార్డుల నిండా శిథిలాలు పేరుకుపోయాయి. దట్టమైన పొగలు వెలువడటంతో హాస్పిటల్ లో ఉన్న రోగులు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించారు. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ రాజధాని టెహ్రాన్ యుద్ధ జ్వాలలతో అట్టుడుకుతోంది. ఓ వైపు బాంబు



దాడులు జరుగుతున్నా నర్సులు తమ ప్రాణాలకు తెగించి ఇన్సులేటర్లలో ఉన్న నవజాత శిశువులను, ఐసీయూలోని చిన్నపిల్లలను చేతులతో పట్టుకొని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ఘటనపై ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ టెడ్రోస్ అధనామ్ స్పందించారు. ఆసుపత్రులపై దాడులు జరగడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం అన్నారు. ఇలాంటి దాడులను అడ్డుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఇదిలావుంటే ఇరాన్‌లోని మినాబ్ ప్రావిన్స్‌లోని ఒక ప్రాథమిక పాఠశాలపై ఇజ్రాయిల్ దాడిలో మరణించిన వారి సంఖ్య 165కి పెరిగిందని ఇరాన్ మీడియా నివేదించింది. దక్షిణ ఇరాన్‌లోని హోర్మోజ్‌గాన్ ప్రావిన్స్‌లోని మినాబ్‌లోని షాజారే తయ్యిబె బాలికల ప్రాథమిక పాఠశాలలో శనివారం ఈ దాడి జరిగింది. 96 మంది గాయపడ్డారని ఐఆర్ఎన్ఏ వార్తా సంస్థ నివేదించింది. దాడి జరిగిన ప్రదేశంలో శోధన, రక్షణ చర్యలు ముగిశాయని మినాబ్ కౌంటీ గవర్నర్ తెలిపారు. బాలికల పాఠశాలపై దాడి వార్తలను ఇజ్రాయిల్ ఖండించింది. నివేదికలను పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి ట్విట్టర్‌లో దాడికి సంబంధించిన ఫోటోను పంచుకున్నారు. ఇజ్రాయిల్, అమెరికా శనివారం ఇరాన్‌పై ఉమ్మడి దాడిని ప్రారంభించాయి. ఈ దాడిలో ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మరియు ఇతర సీనియర్ సైనిక అధికారులు మరణించారు.

# శివమ్ దూబే వల్లే గెలిచాం: గంభీర్



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా సెమీస్‌కు దూసుకెళ్లింది. ఆదివారం కోల్‌కతా వేదికగా జరిగిన డూ ఆర్ డై సూపర్-8 మ్యాచ్‌లో టీమిండియా 5 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. సంజూ శాంసన్ (50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో 97 నాటౌట్) అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు.అయితే సంజూ శాంసన్‌తో పాటు మ్యాచ్ చివర్లో శివమ్ దూబే కొట్టిన రెండు బౌండరీలు కూడా భారత విజయంలో కీలక పాత్ర పోషించాయని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు. తీవ్ర ఒత్తిడిలో దూబే ఆ రౌండు బౌండరీ కొట్టకపోయి ఉంటే పరిస్థితి మరింత క్లిష్టంగా మారేదని చెప్పాడు. భారత విజయంలో సంజూ ఇన్నింగ్స్ ఎంత పాత్ర పోషించిందో.. శివమ్ దూబే బౌండరీలకు అంతే విలువ ఉందని గంభీర్ చెప్పుకొచ్చాడు.ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న గంభీర్.. శివమ్ దూబే బ్యాటింగ్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు. 'మనం కొన్ని ప్రత్యేకమైన సహకారాల గురించి మాట్లాడుకుందాం. శివం దూబే కొట్టిన ఆ రెండు బౌండరీలు.. సంజూ ఆడిన 97 పరుగుల ఇన్నింగ్స్‌తో సమానమని నేను భావిస్తున్నాను. ఇది ఒక టీమ్ గేమ్. కాబట్టి ఆ రెండు బౌండరీలు సంజూ ఇన్నింగ్స్ అంత కీలకం. ఎందుకంటే ఈ మ్యాచ్‌లో భారత్ గెలవకపోయి ఉంటే.. సంజూ ఇన్నింగ్స్ గురించి ఎవరూ మాట్లాడుకునేవాళ్లు కాదు.సంజూ శాంసన్ ఒక అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కానీ జట్టు గెలవడానికి ఇలాంటి చిన్న చిన్న సహకారాలే సహాయపడతాయి. పెద్ద స్కోర్లు హెడ్‌లైన్స్‌లో నిలుస్తాయి, కానీ జట్టు గెలుపు గీత దాటడానికి దోహదపడే ఇలాంటి చిన్న సహకారాలే చాలా కీలకం. నేను హెడ్ కోచ్‌గా ఉన్నంత కాలం ఇదే మా ఫిలాసఫీగా ఉంటుంది.'అని గంభీర్ స్పష్టం చేశాడు.



# సంజూ శాంసన్.. కోహ్లీ, రోహిత్ రికార్డ్ బద్దలు!

టీమిండియా విధ్వంసకర బ్యాటర్ సంజూ శాంసన్ చరిత్ర సృష్టించాడు. టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే ఛేజింగ్‌లో అత్యధిక వ్యక్తిగత పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. అలాగే టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో అత్యధిక బౌండరీలు బాదిన ఆటగాడిగా కూడా సంజూ శాంసన్ చరిత్రకెక్కాడు. ఈ క్రమంలో భారత క్రికెట్ దిగ్గజాలైన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల రికార్డులను సంజూ శాంసన్ అధిగమించాడు.ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో భాగంగా వెస్టిండీస్‌తో కోల్‌కతా వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సంజూ శాంసన్ (50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో 97 నాటౌట్)అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో ఈ ఫీట్ సాధించాడు. ఇప్పటి వరకు టీ20 ప్రపంచకప్ ఛేజింగ్‌లో టాప్ స్కోర్ కోహ్లీ పేరిట ఉండేది. అతను టీ20 ప్రపంచకప్ 2022లో పాకిస్థాన్‌పై, 2016 టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై ఛేజింగ్‌లో 82 పరుగులు చేశాడు.సంజూ శాంసన్ తరహాలోనే ఈ రెండు మ్యాచ్‌ల్లో కోహ్లీ భారత్‌కు విజయాన్నందించాడు. తాజా మ్యాచ్‌లో సంజూ 97 పరుగులతో అజేయంగా నిలిచి కోహ్లీని వెనక్కినెట్టాడు. ఈ మ్యాచ్‌లో 16 బౌండరీలతో టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో అత్యధిక బౌండరీలు బాదిన రోహిత్ శర్మ(15)ను రికార్డును అధిగమించాడు.రోహిత్ శర్మ 2024 టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై 7 ఫోర్లు, 8 సిక్సర్లతో 15 బౌండరీలు బాదగా.. సంజూ శాంసన్ తాజా ఇన్నింగ్స్‌లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో మొత్తం 16 బౌండరీలు బాది హిట్ మ్యాన్‌ను అధిగమించాడు. సురేశ్ రైనా తర్వాత టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ కలిగిన రెండో భారత బ్యాటర్‌గా సంజూ శాంసన్ నిలిచాడు. 2010 టీ20 ప్రపంచకప్‌లో సురేష్ రైనా(60 బంతుల్లో 101) సౌతాఫ్రికాపై సెంచరీతో చెలరేగాడు. పొట్టి ప్రపంచకప్‌లో భారత్ తరఫున సెంచరీ బాదిన ఏకైక బ్యాటర్ కూడా సురేష్ రైనానే కావడం గమనార్హం.గురువారం వాంఖడే వేదికగా జరిగే సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. సంజూ శాంసన్ సూపర్ ఫామ్ నేపథ్యంలో అభిషేక్ శర్మను తుది జట్టు నుంచి తప్పించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు అనడానికి సంజూ శాంసన్ కెరీరే ఉదాహరణ. ఈ మెగా టోర్నీకి ముందు సంజూ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడ్డాడు. ఐదు మ్యాచ్‌లకు ఐదింటిలో విఫలమయ్యాడు. చివరకు తుది జట్టులో చోటు కోల్పోయాడు. కానీ అనూహ్యంగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అసలు సిసలు మ్యాచ్‌లో సత్తా చాటాడు. జీవితానికి సరిపోయే ఇన్నింగ్స్ ఆడాడు.



## 3వసారి సెమీస్‌లో ఢీ కొట్టనున్న

# భారత్, ఇంగ్లాండ్

టీమ్ ఇండియా మరోసారి టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. సూపర్-8 దశలో ఉత్కంఠభరిత పోరాటం అనంతరం, కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన 'డూ లేదా డై' మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించి చివరి నాలుగులో చోటు సంపాదించింది. ఇది వరుసగా మూడోసారి భారత్ సెమీఫైనల్ చేరడం విశేషం. 2022, 2024 ఎడిషన్లలో కూడా టీమ్ ఇండియా సెమీఫైనల్ దశకు చేరుకుంది.ఈ కీలక మ్యాచ్‌లో భారత్‌కు తప్పనిసరిగా విజయం అవసరం. ఓటమి పాలైతే టోర్నీ ప్రయాణం ముగిసిపోయేది. కానీ సంజూ శాంసన్ అద్భుతమైన నాటౌట్ 97 పరుగులతో జట్టును విజయానికి చేర్చాడు. 196 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ విజయవంతంగా ఛేదించింది.ఇప్పుడు మార్చి 5న ముంబై వాంఖడే స్టేడియంలో భారత్, ఇంగ్లాండ్ మధ్య రెండో సెమీఫైనల్ జరగనుంది. ఆసక్తికర విషయం ఏమిటంటే, ఇది వరుసగా మూడో టీ20 వరల్డ్ కప్, ఈ రెండు జట్లు సెమీఫైనల్‌లో తలపడుతున్న సందర్భం. గత రెండు ఎడిషన్లలో ఒక విశేషమైన సెంటిమెంట్ ఉంది. భారత్-ఇంగ్లాండ్ సెమీఫైనల్‌లో గెలిచిన జట్టే చివరికి చాంపియన్‌గా నిలిచింది. 2022లో భారత్‌ను ఓడించిన ఇంగ్లాండ్ ఫైనల్‌లో టైటిల్ గెలిచింది. 2024లో ఇంగ్లాండ్‌ను ఓడించిన భారత్ చివరకు ట్రోఫీ సాధించింది. ఇప్పుడు 2026లో కూడా ఇదే సెంటిమెంట్ కొనసాగుతుందా? అన్నది 8న జరిగే ఫైనల్‌తో స్పష్టమవుతుంది. మొత్తానికి, భారత్-ఇంగ్లాండ్ సెమీఫైనల్ పోరు మరోసారి ప్రపంచ క్రికెట్ అభిమానులను ఉత్కంఠకు గురి చేయనుంది. గెలిచే జట్టే చాంపియన్ అవుతుందా? అన్న ప్రశ్నకు సమాధానం త్వరలోనే తెలుస్తుంది.



# అభిషేక్ శర్మ ఫామ్‌పై అనిల్ కుంబ్లే ఆందోళన

టీ20 వరల్డ్ కప్ 2026 క్లైమాక్స్‌కు చేరుకుంది. సెమీఫైనల్ బెర్తులు ఖరారైన వేళ టీమిండియాలో ఒకే ఒక్కడి ఫామ్ ఇప్పుడు సెలక్టర్లకు, అభిమానులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. అతడే యువ ఓపెనర్ అభిషేక్ శర్మ. ఐపీఎల్‌లో పరుగుల వరద పారించి, సిక్సర్ల కింగ్‌గా పేరు తెచ్చుకున్న ఈ కుర్రాడు.. మెగా టోర్నీలో మాత్రం అట్టర్ ఫ్లాప్ అయ్యాడు. తాజాగా వెస్టిండీస్‌తో జరిగిన చావోరేవో తేల్చుకోవాల్సిన సూపర్ 8 మ్యాచ్‌లో కూడా అభిషేక్ చేతులెత్తేశాడు. 11 బంతుల్లో కేవలం 10 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరడం గిల్ సేనలో చర్చకు దారితీసింది. అభిషేక్ శర్మకు ఈ టోర్నీ ఒక పీడకలలా మారింది. గ్రూప్ స్టేజీలో ఆడిన మూడు మ్యాచుల్లో వరుసగా మూడు సార్లు డకౌట్ (0, 0, 0) అయి చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు.



# పాకిస్తాన్ ఆటగాళ్లకు ఫైన్ వేసిన పీసీబీ!

2026 ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్తాన్ క్రికెట్ జట్టు ప్రదర్శన చాలా నిరాశపరిచింది. దీని పరిణామాలు ఆటగాళ్లపై గట్టిగానే ఉంటోంది. పాకిస్తాన్ జట్టు పేలవమైన ప్రదర్శనకు సంబంధించి పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కఠిన చర్యలు తీసుకుంది. ప్రతి ఆటగాడికి జరిమానా విధించాలని పీసీబీ నిర్ణయించింది. పాకిస్తాన్ జట్టు టోర్నమెంట్ నుంచి నిష్క్రమించిన తర్వాత ఈ శిక్ష వేశారు. ఇందులో ప్రత్యేకత ఏమిటంటే, పీసీబీ స్వయంగా ఆటగాళ్ల నుంచి ఈ మొత్తాన్ని వసూలు చేస్తుంది, ఇది చాలా ఆశ్చర్యకరమైన నిర్ణయంగా కూడా చెబుతున్నారు. 2026 టీ20 ప్రపంచ కప్‌లో సూపర్ 8 రౌండ్ నుంచి పాకిస్తాన్ నిష్క్రమించింది. పాకిస్తాన్ సెమీ-ఫైనల్‌కు చేరుకోలేకపోయిన వరుసగా ఇది నాల్గో ఐసీసీ టోర్నమెంట్. అందుకే పాకిస్తాన్ క్రికెట్ బోర్డు కఠినమైన చర్యలు తీసుకుంది. మీడియా నివేదికల ప్రకారం, పీసీబీ ప్రతి ఆటగాడికి 5 మిలియన్ పాకిస్తానీ రూపాయలు (సుమారు 1.6 మిలియన్ భారతీయ రూపాయలు) జరిమానా విధించింది. ఈ జరిమానా ప్రపంచ కప్‌లో పాల్గొన్న జట్టు సభ్యులందరికీ వర్తిస్తుంది. ముఖ్యంగా జట్టు ఇప్పటికే విమర్శలను ఎదుర్కొంటున్నందున, పాకిస్తాన్ క్రికెటర్లకు ఇది భారీ మొత్తం అని చెప్పవచ్చు. ఈ మొత్తాన్ని పీసీబీ స్వయంగా తిరిగి తీసుకోనుంది. ఆటగాళ్లు తమ జీతాలు, మ్యాచ్ ఫీజులు లేదా ఇతర చెల్లింపుల నుంచి తగ్గింపులను భరించాల్సి ఉంటుంది. శ్రీలంకలో జరిగిన టీ20 ప్రపంచ కప్2026 లో పాకిస్తాన్ తన అన్ని మ్యాచ్‌లు ఆడింది, కానీ దీనిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. వారు నెదర్లాండ్స్‌ను మూడు వికెట్ల తేడాతో ఓడించడం ద్వారా టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అయితే, ఆ మ్యాచ్‌లో కూడా వారు తృటిలో ఓటమిని తప్పించుకున్నారు. ఆ తర్వాత వారు యూఎస్ఏ పై 32 పరుగుల తేడాతో గెలిచారు, కానీ టీమ్ ఇండియాపై 61 పరుగుల తేడాతో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత వారు ఏదో విధంగా సూపర్ 8లోకి ప్రవేశించారు. అయితే, సూపర్ 8లలో వారి ప్రదర్శన అంతగా ఆకట్టుకోలేదు. వర్షం కారణంగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్ రద్దు అయిన తర్వాత, వారు ఇంగ్లాండ్ చేతిలో రెండు వికెట్ల తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత వారు శ్రీలంకపై గెలిచారు, కానీ నెట్ రన్ రేట్ కారణంగా సెమీ-ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయారు.

# భారత్- ఆఫ్ఘనిస్తాన్ మధ్య తొలిసారి వన్డే సిరీస్

**2 దేశాల మధ్య ద్వైపాక్షిక వన్డే సిరీస్**

**3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ జూన్ 2026లో మొదలు**

టి20 వరల్డ్ కప్ 2026 మ్యాచ్‌లతో టీమిండియా బిజీగా ఉన్న సమయంలో బీసీసీఐ మరో కొత్త సిరీస్ ప్రకటించింది. భారత క్రికెట్ అభిమానులకు ముఖ్యమైన అప్డేట్ ఇచ్చింది. ఐపీఎల్ 2026 తర్వాత జూన్ నెలలో భారత జట్టు తన సొంత గడ్డపై ఒక కొత్త సవాలుకు సిద్ధం కానుంది. భారత్, ఆఫ్ఘనిస్తాన్‌తో తలపడబోతోంది. అయితే ఇది సాధారణ సిరీస్ మాత్రం కాదు. ఆ జట్టుకు గుర్తుండిపోయే మెమరీ ఇది. ఇది రెండు దేశాల మధ్య తొలి వన్డే సిరీస్ కావడంతో అఫ్గాన్ జట్టుకు ప్రాధాన్యత సంతరించుకుంది. టీమిండియా ఇప్పటివరకు ఆఫ్ఘనిస్తాన్‌తో ఐసీసీ టోర్నమెంట్లు, ఆసియా కప్ వంటి పెద్ద వేదికల పై వన్డే మ్యాచ్‌లు ఆడింది. కానీ 2 దేశాల మధ్య ఇప్పటి వరకు ఒక్క ద్వైపాక్షిక వన్డే సిరీస్ కూడా జరగలేదు. అందుకే జూన్ 2026లో జరగనున్న ఈ 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ చరిత్రలో మొదటిసారిగా నమోదు కానుంది.ఈ పర్యటన ఏకైక టెస్ట్ మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది. చండీగఢ్‌లో జూన్ 6 నుండి జూన్ 10 మధ్య రెండు జట్లు తొలి జట్టులో



తలపడనున్నాయి. భారత్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య ఇది రెండవ టెస్ట్ మ్యాచ్ మాత్రమే. అంతకు ముందు రెండు జట్ల మధ్య 2018లో కేవలం ఒకే ఒక టెస్ట్ జరిగింది. 2018లో జరిగిన ఆ టెస్ట్ ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ చరిత్రలో మొట్టమొదటి టెస్ట్ మ్యాచ్ కావడం విశేషం. ఈ టెస్ట్ మ్యాచ్ తర్వాత జూన్ 14 నుండి భారత్, ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య చారిత్రాత్మక వన్డే సిరీస్ కూడా జరగనుంది. దీని మొదటి మ్యాచ్ ధర్మశాలలో జరగ నుండగా, రెండవ మ్యాచ్ లక్నో వేదికగా, మూడవ మ్యాచ్ చెన్నైలో నిర్వహించనున్నారు. ప్రపంచంలోని బలమైన జట్లలో ఒకటైన భారత్‌తో వారి స్వదేశంలో ఆడే అవకాశం రావడం ఆఫ్ఘనిస్తాన్ ఆటగాళ్లకు పెద్ద పరీక్షగా మారవచ్చు.

కానీ వారికి ఇలా ంటి సిరీస్‌లు రావడం ఆఫ్గన్ క్రికెట్‌కు మేలు చేస్తుంది. మరోవైపు ఇండియాకు ఈ సిరీస్ 2027 వన్డే వరల్డ్ కప్ సన్నాహాల దిశగా మొదటి అడుగుగా భావిస్తున్నారు.

# 'విశ్వనాథ్ అండ్ సన్స్'

## సూర్య-వెంకీ అట్లూరి చిత్రానికి టైటిల్ ఖరారు.. ఆకట్టుకుంటున్న ఫస్ట్ లుక్

ఈ ఏడాది జులైలో సినిమా విడుదల చేసేందుకు సన్నాహాలు కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రానికి సంబంధించిన కీలక అప్డేట్ వచ్చేసింది. సూర్య 46వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'విశ్వనాథ్ అండ్ సన్స్' అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం అధికారికంగా విడుదల చేసింది. ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది.

విడుదలైన ఫస్ట్ లుక్‌లో సూర్య కళ్లద్దాలు ధరించి, ఓ చిన్నారిని ఎత్తుకుని ఎంతో ప్రేమగా కనిపిస్తున్నారు. బాధ్యతాయుతమైన తండ్రి పాత్రలో ఆయన లుక్ పరిపక్వంగా, భావోద్వేగభరితంగా ఉంది. సింపుల్‌గా ఉన్నప్పటికీ ఎమోషనల్ టచ్‌తో ఉన్న ఈ పోస్టర్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ లుక్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. ఈ మూవీలో 'ప్రేమలు' చిత్రంతో పాప్యులర్ అయిన మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే, ఈ ప్రాజెక్ట్‌లో రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్, భవాని శ్రే వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. కుటుంబ నేపథ్యం, బలమైన భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలు కలగలిపి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. 'లక్కీ భాస్కర్' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తుండటంతో ఈ సినిమాపై తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని జులైలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.




# 'ఉస్తాద్ భగత్ సింగ్' రీమేక్ కాదు..

## అసలు నిజం చెప్పిన హరీశ్ శంకర్

పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై గత కొంతకాలంగా జరుగుతున్న ప్రచారానికి దర్శకుడు హరీశ్ శంకర్ ఫుల్‌స్టాప్ పెట్టారు. ఈ సినిమా తమిళ బ్లాక్‌బస్టర్ 'తెరి'కి రీమేక్ అంటూ వస్తున్న ఊహాగానాలపై ఆయన ఘాటుగా స్పందించారు. తన సినిమా రీమేక్ కాదని స్పష్టం చేయడమే కాకుండా అసలు 'తెరి' చిత్రంలోనే తన 'గబ్బర్ సింగ్' సినిమాలోని ఓ సన్నివేశాన్ని కాపీ చేశారని ఆరోపించారు.

తాజాగా ఓ ప్రమోషనల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన హరీశ్ శంకర్, తాను రీమేక్ చేస్తే నిజాయతీగా ఒప్పుకుంటానని స్పష్టం చేశారు. "గబ్బర్ సింగ్ చిత్రానికి నేను 'మాటలు, మార్పులు, దర్శకత్వం' అని టైటిల్ కార్డ్ వేసుకున్నాను. బహుశా తెలుగు ఇండస్ట్రీలో అలా వేసుకున్న మొదటి వ్యక్తిని నేనే. ఆ టైటిల్ కార్డు చూసి రాజమౌళి గారు ఫోన్ చేసి మెచ్చుకున్నారు. అలాంటిది, 'ఉస్తాద్ భగత్ సింగ్' నిజంగా రీమేక్ అయితే 'కథ, మాటలు, దర్శకత్వం' అని ఎందుకు వేసుకుంటాను?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

రీమేక్ ఆరోపణలను తిప్పికొడుతూ ఆయన ఓ ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టారు. "గబ్బర్ సింగ్‌లో నేను పెట్టిన అంత్యాక్షరి ఎపిసోడ్‌ను స్ఫూర్తిగా తీసుకుని 'తెరి'లో రౌడీలతో రైమ్స్ చెప్పించారు. నా సినిమాలోని సీన్‌ను వాళ్లు వాడుకుంటే, ఇప్పుడు ఆ సినిమానే నేను రీమేక్ చేస్తున్నానని ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం?" అంటూ హరీశ్ శంకర్ అసహనం వ్యక్తం చేశారు. ఏ పోలీస్ కథలో అయినా హీరో సంఘ విద్రోహ శక్తులపై పోరాడతాడని, 'తెరి', 'టెంపర్' వంటి సినిమాలన్నీ ఆ కోవకే చెందుతాయని అన్నారు.

పవన్ కల్యాణ్ కెరీర్‌లో 'గబ్బర్ సింగ్' ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఆ సినిమా తర్వాత ఈ కాంబోలో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ



మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో పవన్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలకు అద్భుతమైన స్పందన రాగా, సినిమా ఈ నెల 26న విడుదలకు సిద్ధమవుతోంది.



# బ్లూ వెలుగుల్లో రకుల్ హీట్!

సాధారణంగా ప్రతి ఒక్కరి జీవితంలో ఏదో ఒక అద్భుతమైన క్షణం జరిగే ఉంటుంది. అయితే ఇప్పుడు తన జీవితంలో ఆ మధురమైన క్షణం ఈరోజు వచ్చింది అంటూ రకుల్ ప్రీత్ సింగ్ తన ఇంస్టాగ్రామ్ ద్వారా షేర్ చేసుకున్న ఫోటోలు అభిమానులను ఆనందానికి గురి చేస్తున్నాయి. అసలు విషయంలోకి వెళ్తే.. ఇటీవల ఈమె నటించిన 'దేదే ప్యార్ దే 2' సినిమాకి గాను బెస్ట్ పెర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే తాజాగా జీ సినీ అవార్డ్స్ 2026 వేడుకల్లో భాగంగా రకుల్ ప్రీత్ సింగ్ అవార్డు అందుకున్న క్షణాలకు సంబంధించిన ఫోటోలను తన ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. ూశ్రీంశీ ఇందులో బ్లూ గ్లిటర్తో డిజైన్ చేసిన ఒక అందమైన డ్రెస్ ధరించి తన అందాలతో వేడుకకే స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది ఈ ముద్దుగుమ్మ. ఫ్రంట్ డీప్ వీ నెక్ తో డిజైన్ చేసిన ఈ డ్రెస్ ఈమె అందాలను రెట్టింపు చేసింది. అసలే వైట్ స్కిన్ టోన్ దీనికి తగ్గట్టు బ్లూ డ్రెస్ ఇక ఈమె అందాలను ఏ విధంగా మార్చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మొత్తానికైతే బ్లూ డ్రెస్ లో జీ సినీ అవార్డ్స్ వేడుకల్లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది రకుల్ ప్రీత్ సింగ్. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఇకపోతే రకుల్ ప్రీత్ సింగ్ ఈ విషయాన్ని అభిమానులతో పంచుకుంటూనే మరొకవైపు ఇలా క్యాప్షన్ జోడించింది. "చాలా సంవత్సరాల తర్వాత మొదటిసారి జీ సినీ అవార్డును అందుకోవడం ..అందులోనూ దేదే ప్యార్ దే 2 చిత్రానికి బెస్ట్ పెర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్ విభాగంలో అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా కొన్ని ప్రయాణాలు ఎప్పుడు మీతోనే ఉంటాయి. అది ప్రేమ, నవ్వు ఇలా ఎప్పటికీ గుర్తించుకునే జ్ఞాపకాలతో ఆ ప్రయాణం నిండి ఉంటుంది. నాకు మద్దతుగా నిలిచిన అజయ్ దేవగన్, యాక్టర్ మాధవన్, చిత్ర బృందానికి నేను ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ముఖ్యంగా నన్ను నమ్మి ఆదరిస్తున్న అభిమానులకు ఎప్పటికీ రుణపడి ఉంటాను" అంటూ రకుల్ ప్రీత్ సింగ్ క్యాప్షన్ జోడించింది.



# 'దండోరా' సినిమా ఫెయిల్ కావడానికి కారణం ఇదే: శివాజీ

నటుడు శివాజీ ప్రధాన పాత్రలో నటించిన 'దండోరా' చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకున్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో సినిమా వైఫల్యానికి గల కారణాలను శివాజీ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో విశ్లేషించారు. సినిమా విడుదల సమయం (రిలీజ్ డేట్) సరిగ్గా లేకపోవడమే ప్రధాన తప్పిదమని ఆయన అభిప్రాయపడ్డారు. డిసెంబర్ 25న సినిమాను విడుదల చేయాలని భావించినప్పటికీ, సెన్సార్ ప్రక్రియలో జాప్యం జరిగిందని.. 24వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు క్లియరెన్స్ రాకపోవడంతో థియేటర్ల యజమానులు రిస్క్ తీసుకోలేకపోయారని ఆయన వెల్లడించారు. సెన్సార్ అవుతుందో లేదో అన్న అనిశ్చితి వల్ల ఎవరూ థియేటర్లు ఇవ్వడానికి ముందుకు రాలేదని, అది సినిమాపై తీవ్ర ప్రభావం చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం విడుదల సమయమే కాకుండా, సినిమా టైటిల్ కూడా మైనస్ అయిందని శివాజీ పేర్కొన్నారు. 'దండోరా' అనే పేరు వినగానే ఇది ఒక కమ్యూనిస్టు భావజాలం ఉన్న సినిమా అని ప్రేక్షకులు భావించారని చెప్పారు. అందుకే, ఆ టైటిల్ మార్చాలని తాను నెల రోజుల పాటు ప్రయత్నించానని, కానీ కుదరలేదని చెప్పారు. హైదరాబాద్ వంటి నగరాల్లో కూడా సినిమాకు సరైన ప్రైమ్ టైమ్ షోలు దక్కలేదని.. కేవలం సాయంత్రం 4 గంటలకు, రాత్రి 10 గంటలకు మాత్రమే షోలు ఇచ్చారని తెలిపారు. అయినప్పటికీ, ఉన్న తక్కువ స్క్రీన్లతోనే నైజాం ఏరియాలో కోటి రూపాయల కలెక్షన్లను రాబట్టడం విశేషమని, ఒకవేళ సరైన థియేటర్లు మరియు షోలు లభించి ఉంటే సినిమా భారీ విజయాన్ని నమోదు చేసేదని శివాజీ స్పష్టం చేశారు. కంటెంట్ పరంగా మెప్పించినా... సాంకేతిక, పంపిణీ పరంగా జరిగిన లోపాల వల్లే 'దండోరా' వెనుకబడిందని ఆయన వివరించారు.

# స్పిరిట్ నుంచి ప్రకాశ్ రాజ్ ఔట్



గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో మోస్ట్ ఎవెయిటెడ్ క్రేజీ ప్రాజెక్ట్ స్పిరిట్. యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే మొదలైంది. కాగా ఈ చిత్రంలో విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలో నటిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే స్పిరిట్ షూటింగ్‌ను తాను ఇంకా మొదలుపెట్టలేదని క్లారిటీ కూడా ఇచ్చాడు ప్రకాశ్ రాజ్. ఇదిలా ఉంటే మరోవైపు ఎవరూ ఊహించని విధంగా బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ లుక్‌ను షేర్ చేశారు. ఈ నేపథ్యంలో తాజా పుకారు ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. మేకర్స్ ప్రకాశ్ రాజ్ పేరు ట్యాగ్ చేయకపోయే సరికి దాదాపు స్పిరిట్ నుంచి తప్పుకున్నట్టేనంటూ కొత్త వార్త తెరపైకి వచ్చింది. రాజకీయాలకు సంబంధించిన కామెంట్స్ చేయడం సినిమాపై ప్రభావం చూపించే అవకాశం ఉందని సందీప్ రెడ్డి వంగా ప్రకాశ్ రాజ్‌కు చెప్పాడట. అయితే కామెంట్స్ చేయడం గురించి ప్రకాశ్ రాజ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి ఎలాంటి హామీనివ్వకపోవడంతో ఈ సినిమా నుంచి ప్రకాశ్ రాజ్ తప్పించి వివేక్ ఒబెరాయ్‌ను తీసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. కానీ ఈ వార్తలపై మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. హై ఓల్టేజీ కాప్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో యానిమల్ ఫేం తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తోంది.

# సొంతూరు తుమ్మెన్‌పేట్‌లో విరోష్ దంపుతులు



వివాహానంతరం టాలీవుడ్ క్రేజీ కపుల్ విజయ్ దేవరకొండ-రష్మిక స్వగ్రామానికి రావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం తుమ్మెన్‌పేట గ్రామం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. నూతన దంపతుల రాకతో గ్రామంలో ఉత్సాహం వెల్లివిరిసింది. పెళ్లి తర్వాతి సంప్రదాయ ఆచారాల్లో భాగంగా ఈ జంట డప్పు, మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా గ్రామంలోకి ప్రవేశించారు. అనంతరం తులసిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సత్యనారాయణ స్వామి వ్రతంలో ఆసీనులై, కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నేతలు, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 400 మందికి పైగా ఆహ్వానితులు హాజరైనట్లు సమాచారం. విజయ్-రష్మికలను ఒక్కసారి చూడాలనే ఆశతో చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా చేరుకున్నారు. తమ అభిమాన నటులు సొంత ఊరిలో ఇంత సాదాసీదాగా, సంప్రదాయ బద్ధంగా వేడుకలు జరుపుకోవడం చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలోని వీధులన్నీ జనంతో కళకళలాడాయి. స్టార్ కపుల్ రాక నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. వారి నివాసం వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. ముందస్తు పాసులు ఉన్న వారినే లోపలికి అనుమతించారు. అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్ నేతృత్వంలో సీఐ నాగరాజు, బల్మూరు ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. టాలీవుడ్‌లో సెన్సేషన్‌గా నిలిచిన ఈ జంట తమ స్వగ్రామంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియోలు, ఫోటోలు అభిమానుల్లో విపరీతంగా షేర్ అవుతూ ట్రెండ్ అవుతున్నాయి.

Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888

భవిష్యత్
ప్రజాపాలన
తెలుగు దినపత్రిక

అనుబంధ సంచిక

మంగళవరం ,మార్చి 03, 2026 పేజీలు : 08



వివరాలు 5లో

# ఘరానా మోసం కస్టమర్లకు మోసం చేసిన మణికంఠ ట్రేడర్స్ వ్యాపారి ఊరే శ్రీధర్










# అసాంఘిక కార్యక్రమాల అడ్డగా ప్రాథమిక పాఠశాల

వివరాలు 4లో

చింతపల్లి మండలంలోని హోమెంతలపల్లి ప్రాథమిక ఉన్నంత పాఠశాలలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు నిన్న రాత్రి సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తాగి గంజాయి ఆనవాయితీలు ఉన్నాయి



## తుమ్మల అయ్య జాగా కాదు.. పొంగులేటి పెయిడ్ పొలిటీషియన్.. కూల్చివేతలపై బక్క జడ్సన్



**ఖమ్మం:** ఏడ్చేవాళ్లంతా పెయిడ్ ఆర్టిస్టులేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అనడం మాజీ కాంగ్రెస్ నేత బక్క జడ్సన్ తీవ్ర స్థాయిలో విరుచుకపడ్డారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక పెయిడ్ పొలిటిషియన్ అని మాజీ కాంగ్రెస్ నేత బక్క జడ్సన్ ఆరోపించారు. పొంగులేటి పెయిడ్ ఆర్టిస్ట్ అయివుండి ఇల్లు కోల్పోయిన వాళ్ళను పెయిడ్ ఆర్టిస్టులు అంటున్నాడు. పొంగులేటి వైఎస్సార్సీపీ నుండి బీఆర్ఎస్ పార్టీకి పెయిడ్ ఆర్టిస్టుగానే వచ్చాడు.. బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీకి పెయిడ్ ఆర్టిస్టుగా వచ్చాడు'తుమ్మల నాగేశ్వర్‌రావు మంత్రిగా ఉన్నప్పుడు ఆయనకు గ్లాసులు అందించేటోడు.. చిన్న కాంట్రాక్టర్.. పేమెంట్లతో ఇంతపెద్ద ఆర్టిస్టుగా నువ్వు (పొంగులేటి) తయారైనవు. అంటే వేరేవాళ్లను పెయిడ్ ఆర్టిస్టులంటూ మాట్లాడే స్థాయికి వచ్చినవు. పార్టీలు మారుతున్నా కొద్దీ నీకు ప్రమోషన్స్ పెరుగుతున్నయి. ఇవాళ నువ్వు మల్కం చెరువులో గచ్చిబౌలిలో కొన్ని మల్టీస్టోర్ అపార్ట్‌మెంట్స్ కట్టే పరిస్థితి ఉన్నది. కూల్చివేతలు జరిగిన ప్రదేశానికి ఎదురుగా ఉన్న ఎన్ఎస్పీ స్థలంలో కట్టిన నీ ఎస్ఆర్ ఫంక్షన్ హాల్.. ఏ జాగా అది కూలగొట్టొద్దా..? అది ఎందుకు కూలగొడుతలేరు. అది కూలగొడితే 100 ఇండ్లు కట్టొచ్చన్నాడు బక్క జడ్సన్.'ఇక్కడ నువ్వు 600 ఇండ్లు కూలగొట్టినవ్. నేను దీనిపై ఎన్‌హెచ్ఆర్సీల ఫిర్యాదు కూడా చేసిన. అవి దానం ఇచ్చిన భూములు.. ఆ భూముల్లో ఇండ్లు కట్టుకోవచ్చు. ఓ పెద్ద మనిషి వినోబాబావే పిలుపు మేరకు భూదానం చేసిండు. ఆ భూమిలో 100 గజాల చొప్పున ఆ కుటుంబాలు ఇండ్లు కట్టుకున్నయ్. నీ అయ్య జాగా కాదు.. నీ అవ్వ జాగా కాదు. తుమ్మల అయ్య జాగా కాదు.. భట్టి అయ్య జాగా కూడా కాదు. ఒక దానం చేద్దామనుకున్న భూస్వామి వాళ్లకు దానం చేసిండు. ఆ దానం చేసిన ఇండ్ల గురించి మాట్లాడితే నువ్వేమో పెయిడ్ ఆర్టిస్టులంటవు.. నువ్వో పెయిడ్ పొలిటీషియన్‌వు. కూల్చివేతల విషయం తనకు తెలియదన్న విషయమై బక్క బడ్సన్ మాట్లాడుతూ.. జిల్లా మంత్రివై ఉండి ఆ విషయం తెలియదంటే నువ్వు మినిస్టర్‌గా అన్‌ఫిట్.. వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీ కొడుకు మీద, నీ మీద ఖీ×= ఫైల్ చేసినందుకు ఒక ఎస్ఐని ట్రాన్స్‌ఫర్ చేశావని' పొంగులేటికి గుర్తు చేశారు బక్క జడ్సన్.భూదాన్ భూములలో ఇండ్లను కూలగొట్టే 15 రోజుల ముందు తుమ్మల నాగేశ్వర్ రావు పోయి చంద్రబాబును కలిశాడని.. ఇప్పుడు వెలుగుమట్ల భూములలో ఇండ్లను కూలగొట్టే జాగాలో టీటీడీ దేవస్థానం వస్తుంది.. దానికోసమే చర్చించడానికి చంద్రబాబుని కలిశాడన్నారు. భట్టి విక్రమార్కకు సంబంధించి కూడా కొన్ని విషయాలు 2 రోజుల్లో బయట పెడుతానన్నారు.ఇవాళ దేవుడా రేవంత్ రెడ్డి కళ్లు మా ఇళ్ల మీద, భూముల మీద పడకుండా చూడమని ప్రజలు కోరుకుంటున్నారు. రాహుల్ గాంధీ వస్తే రోడ్డు మార్గంగుండా తీసుకుపోకుండా ఎక్కడ నిరసనకారులు వచ్చి ప్రశ్నిస్తారో అని భయపడి హెలికాప్టర్‌లో తీసుకుపోయారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి గాంధీ విగ్రహం పెట్టుకోవాలి అంటే నీ ఇల్లు కూలగొట్టు మంది ఇళ్ళతో నీకేం పని..గాంధీ మనవడే ఇల్లు కూల్చి గాంధీ విగ్రహం పెట్టొద్దని చెబుతున్నాడు.. ఆయనకి ఉన్న బుద్ధి మీకు ఎందుకు లేదని బక్క జడ్సన్ చురకలంటించారు.

# అధిక వడ్డీకి అప్పులు, వెంటనే తీర్చాలని మానసికంగా వేధింపులు - వీరి ఆగడాలకు బలైన కుటుంబం

**అంబర్‌పేట్ :** గత నెల 24న అంబర్‌పేట్ పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకున్న కేసును పోలీసులు ఛేదించారు. హోటల్ వ్యాపారం కోసం అప్పు తీసుకోగా వాటిని తిగిరి తీర్చే క్రమంలో వేధింపుల కారణంగా కుటుంబం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. వేధింపులకు గురిచేసిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించారు.హోటల్లో వ్యాపారం అంతంత మాత్రం : అంబర్‌పేట బాపునగర్ కాకతీయ వీధిలో నివాసం ఉంటున్న రామ్‌రాజ్ (55), మాధవి (50), దంపతులకు కుమారుడు శశాంక్ (24), ఓ కుమార్తె ఉన్నారు. కుమార్తెకు ఇటీవల వివాహం జరిపించారు. దీంతో ఆమె కొంపల్లిలో ఉంటున్నారు. గతంలో రామ్‌రాజ్ మరో ఇద్దరితో కలిసి అంబర్ పేటలో ల్యాండ్‌మార్క్ హోటల్‌ను ప్రారంభించారు. అనుకోని పరిస్థుల కారణంగా వారి నుంచి విడపోయి దానినుంచి బయటకు వచ్చారు. తర్వాత కొన్నాళ్లకు మల్లాపూర్‌లో బిర్యానీ హోటల్ పెట్టారు. కుమారుడి సాయంతో ఈ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఈ హోటల్లో వ్యాపారం అంతంత మాత్రంగా సాగుతోంది. దీని వల్ల వారి కుటుంబాన్ని ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి.అధిక వడ్డీకి అప్పులు, వెంటనే తీర్చాలని మానసికంగా వేధింపులు - వీరి ఆగడాలకు బలైన కుటుంబం



నిర్వహణకు మహ్మద్ వాసి ఉజ్ జమాన్, రాజశేఖర్ రెడ్డి, మహ్మద్ నవాజ్, సయ్యద్ మాజిద్‌ల నుంచి సుమారు రూ.57 లక్షలు రుణం తీసుకున్నాడు. అధిక వడ్డీతో రుణం ఇవ్వడంతో పాటుగా బ్లాంక్ చెక్కులు, ప్రామిసరి నోటులు, స్తిరాస్తి పత్రాలు తీసుకున్నారు. డబ్బు తిరిగి ఇవ్వాలని వేధింపులకు గురిచేశారు. కుటుంబ సభ్యులతో దుర్భాషలాడారు. దీంతో మనస్థాపంలో గత నెల 24 కుటుంబం ఆత్మహత్య కు పాల్పడింది.మిత్రుడికి వాట్సప్‌లో మెసేజ్ : ఈ క్రమంలో ఈ నెల 24వ తేదీ మంగళవారం తెల్లవారు జామున రామ్ రాజ్, తన భార్య మాధవి, కుమారుడు శశాంక్‌తో కలిసి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో రామ్‌రాజ్‌తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు తన మిత్రుడు రవికి వాట్సప్?లో మెసేజ్? పంపించారు. దీనిని చూసిన అనంతరం ఆయన ఇంటికి వచ్చి చూశారు. ఆ సమయానికి తండ్రీ కుమారులు ఉరికి వేలాడుతూ విగత జీవులుగా కనిపించారు. మాధవి అప్పటికే ప్రాణాలు విడిచింది. కేసుపై దర్యాప్తు చర్యలు : వెంటనే రవి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షితమూర్తి, అదనపు డీసీపీ నర్సయ్యలతో పాటు పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. దీనిలో మృతుడు శశాంక్ మణికట్టుపై గాయం చేసుకున్న గుర్తులు కనిపించాయని పోలీసులు తెలిపారు. అతడి వద్ద సూసైడ్ నోట్‌ను కనుగొన్నారు. కుమార్తె ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించారు.“గత నెల 24న ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. ఉజ్ జమాన్, రాజశేఖర్ రెడ్డి, మహ్మద్ నవాజ్, సయ్యద్ మాజిద్‌ల రామ్?రాజ్ నుంచి హోటల్ నిర్వహణకు సుమారు రూ.57 లక్షల రుణం తీసుకున్నారు. అధిక వడ్డీతో రుణం ఇవ్వడంతో పాటుగా బ్లాంక్ చెక్కులు, ప్రామిసరి నోటులు, స్తిరాస్తి పత్రాలు ఈ ముగ్గురు తీసుకున్నారు. డబ్బు తిరిగి ఇవ్వాలని వేధింపులకు గురి చేశారు. దీంతో సూసైడ్ నోట్ రాసి ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ నోట్‌లో నలుగురి పేర్లు రాశారు. ఈ కేసులో నలుగురి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాం.” డీసీపీ రక్షితమూర్తి, సికింద్రాబాద్? జోన్? ఆత్మహత్య ఆలోచన నుంచి బయటపడేందుకు హెల్ప్‌లైన్ : మీకు, మీ మిత్రులు, సన్నిహితులకు ఆత్మహత్యకు సంబంధించిన ఆలోచనలు వచ్చినా, తీవ్ర ఒత్తిడిలో ఉన్నా, మీ సమస్యను ఎవరితోనైనా పంచుకోవాలని అనుకుంటున్నా మీకు సహకరించేందుకు హెల్ప్?లైన్ సెంటర్లు సిద్ధంగా ఉన్నాయి. అందుకోసం స్నేహ ఫౌండేషన్ - 04424640050 (24 ఇ 7 అందుబాటులో ఉంటుంది) లేదా టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ హెల్ప్‌లైన్ - 9152987821కి సంప్రదించవచ్చు. వీరు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 8 నుండి రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటారు. వారిని సంప్రదించి మీ సమస్యలను వివరించవచ్చు. తద్వారా తగిన పరిష్కారమార్గాలను పొందవచ్చు.

# పీఏసీ సమావేశంలో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు

**వికారాబాద్, మార్చి 2:** పీఏసీ సభ్యులతో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భేటీ ముగిసింది. ఈ సమావేశంలో రాహుల్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని సూచించారు. దేశంలో నెలకొన్న పరిస్థితులపై సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దుర్మార్గాలన్నీ యటపడుతున్నాయని తెలిపారు. మోదీ తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాహుల్ సూచించారు. ఇరాన్ లాంటి పరిస్థితులు దేశానికి రాకుండా ఉండాలన్నారు.మోదీ ప్రభుత్వ చర్యల వల్ల ఇండియాలో యుద్ధం వచ్చే పరిస్థితులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండో-అమెరికన్ ట్రేడ్ డీల్‌తో ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణలో పార్టీ.. ప్రభుత్వం కలిసి మంచిగా పనిచేస్తున్నాయని రాహుల్ పేర్కొన్నారు. సామాజిక అంశాలపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు పెట్టాలని పార్టీ సీనియర్ నేత వీహెచ్ కోరగా.. అందుకు రాహుల్ సమ్మతి తెలిపారు.ఈ సమావేశంలో రెండు తెలుగు రాష్ట్రాల పీఏసీ సభ్యులు పాల్గొన్నారు. రాహుల్ గాంధీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్, మహేష్ ౧అంశాలపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా౨ాడ్, వైఎస్ షర్మిల తదితరులు హాజరయ్యారు. సమావేశం



అనంతరం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్.. ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ నుంచి అనంతగిరి హరితా రిసార్ట్స్‌కు బయలుదేరారు. అక్కడ జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతుల ముగింపుార్యక్రమంలో రాహుల్, సీఎం రేవంత్ పాల్గొననున్నారు.

భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక

# ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యంత దారుణమైన ఘటన...

- మార్చురీ లో చనిపోయిన శవాన్ని పీక్కుతున్న కుక్కలు...
- కుక్కలకు ఆహారంగా మారిన మృతదేహం...
- ప్రభుత్వ హాస్పిటల్ లో మృతదేహాన్ని భద్రపరచలేని దుస్థితి.

**మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి అవినాష్:**
బతికున్నప్పుడు ఎలా ఉన్నా.. చనిపోయిన వ్యక్తిని గౌరవిస్తుంటాం. మృతదేహానికి అంత్యక్రియలు కూడా గౌరవప్రదంగా జరుపుతూ ఉంటాం.ప్రభుత్వ హాస్పిటల్ లో డెడ్ బాడీ లను పోస్ట్ మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించాల్సిన బాధ్యత వుంటుంది.కానీ జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరచాల్సిన మృతదేహాలకు దిక్కు లేకుండా పోయింది.జడ్చర్ల మండలం నాగసాల గ్రామానికి చెందిన భీమేష్ ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందారు.ఇవాళ మృతదేహం లభ్యం కావడంతో పోస్ట్ మార్టం నిమిత్తం పోలీసులు జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి పోలీసులు తరలించారు.మృతదేహాన్ని భద్రపరచాల్సి న సిబ్బంది ...కనీసం స్ట్రెచర్ మీద కూడా పెట్టకుండా మార్చురీలో పడేయడంతో కుక్కలు పీక్కుతీన్నాయి.ఈ దారుణ ఉదంతం ప్రభుత్వ హాస్పిటల్ లో దయనీయ పరిస్థితి కి అద్దం పడుతుంది.మృతదేహాలను భద్రపరచడానికి ఫ్రీజర్ లు కూడా లేకపోవడం, ఉన్నా పని చేయకోవడం వల్లే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తుంది. సర్కార్ ప్రభుత్వ హాస్పిటల్స్ నిర్వహణలో ఘోరంగా విఫలమైందనడానికి ఈ ఘటన నిదర్శనం,



మౌళిక వసతుల కల్పనలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపిస్తుంది అంటు ఇది విన్న వారు చూసిన వారు గుసగుసలాడుతున్నారు ఇలా మల్లి జారగకుండా చూడాలని కోరుతున్నారు.

# కాంగ్రెస్‌ను శివుడితో.. బీజేపీని విష్ణువుతో పోల్చిన రాహుల్ గాంధీ




**వికారాబాద్ జిల్లా**
అనంతగిరిలో గత 10 రోజులుగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా.. లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరై ప్రసంగించారు. ఈ ప్రసంగంలో భాగంగా రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వివాదాస్పదం అవుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు రాహుల్ గాంధీ చెప్పిన కొత్త అర్థాలు తీవ్ర దుమారానికి కారణం అయ్యాయి. కాంగ్రెస్‌ను శివుడితో.. బీజేపీని విష్ణువుతో పోల్చిన రాహుల్ గాంధీ.. దానికి సంబంధించి క్లారిటీ కూడా ఇచ్చారు. అయితే ఈ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా మండిపడుతోంది.
కాంగ్రెస్ పార్టీని శివుడిగా అభివర్ణించిన రాహుల్ గాంధీ.. హస్తం పార్టీ విధానం అహింస, ప్రజలకు సేవ చేయడం, పార్టీ నమ్ముకున్న సిద్ధాంతాల పైనే దృష్టి పెడుతుందని పేర్కొన్నారు. అదే సమయంలో బీజేపీని విష్ణుమూర్తితో పోల్చిన రాహుల్ గాంధీ.. కమలం పార్టీ విధానం మాత్రం హింస, అధికారం కసం ప్రజలను మోసం చేయడం అని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీకి శివుడి పోలిక ఉందన్న రాహుల్.. మహా శివుడు తన శరీరంలో సగభాగాన్ని మహిళకు ఇచ్చి.. నిరాడంబరంగా.. అడిగితే ఇచ్చే విధంగా ఉంటాడని తెలిపారు. ఇక శివుడి వద్ద త్రిశూలం ఉండి కూడా.. అది ఆయన వెనకే ఉంటుందని పేర్కొన్నారు. ధర్మాన్ని కాపాడాల్సి వచ్చిన సమయంలో మాత్రమే ఆ త్రిశూలాన్ని ఉపయోగిస్తారని రాహుల్ గాంధీ చెప్పారు. ఇక.. బీజేపీకి విష్ణువుతో పోలిక ఉందని పేర్కొంటూ ఆ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విష్ణువు లాగా బీజేపీ పార్టీ ఆడంబరంగా.. కేవలం అధికారంపై మాత్రమే దృష్టి పెట్టే విధానాన్ని అనుసరిస్తుందని విమర్శలు చేశారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి.. రాహుల్ గాంధీ కీలక సూచనలు చేశారు. హస్తం పార్టీ నేతలకు నిజాయితీగా, నిరాడంబరంగా, దృఢత్వంతో ఉండాలని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షులు అంటే.. తమ టీమ్ అని.. భవిష్యత్ పార్టీ కోసం కలిసి పనిచేయాలని హితవు పలికారు. శివుడు, విష్ణువు అంటూ రాహుల్ గాంధీ చేసిన ఈ వ్యాఖ్యల ద్వారా.. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఉన్న రాజకీయ విధానాల మధ్య తేడాలను అర్థమయ్యేలా అందరికీ వివరించారు. అదే సమయంలో నాయకత్వ ధోరణులపై సరికొత్త అర్థాన్ని ప్రస్తావించారు.

## హైదరాబాద్

# హైదరాబాద్‌లో వైన్స్, బార్లు బంద్.. సీపీ సజ్జనార్ ఆదేశాలు




**హైదరాబాద్ :** హైదరాబాద్ లో వైన్స్, బార్లు బంద్ చేయాలని సీపీ సజ్జనార్ ఆదేశాలు జారీ చేశారు. హోలీ పండగ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అన్ని మద్యం దుకాణాలు మూసి ఉంచాలని ఆదేశించారు. రూల్స్ అతిక్రమిస్తే.. కేసులు నమోదు చేస్తామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హోలీ పండగను అందరూ శాంతియుతంగా, ఆనందంగా జరుపుకోవాలని సీపీ సజ్జనార్ ఆకాంక్షించారు.హోలీ పండుగ సందర్భంగా హైదరాబాద్‌లో పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు. మార్చి 3న (మంగళవారం) ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు.. హైదరాబాద్ నగర పరిధిలో వైన్స్, కల్లు కాంపౌండ్లు, బార్లు, క్లబ్‌లు మూసివేయాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సిటీ పోలీస్ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని తీవ్ర హెచ్చరికలు చేశారు. ఎక్కడైనా, ఎవరైనా సమస్యలు సృష్టిస్తే తక్షణమే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్ నగరవాసులు.. పోలీసులకు సహకరించి హోలీ పండుగను సంతోషంగా జరుపుకోవాలని సజ్జనార్ సూచించారు.నగర పరిధిలో హోలీ పండగ వేళ.. లా అండ్ ఆర్డర్‌కు భంగం కలగకుండా.. స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేయాలని వైన్ షాప్ యజమానులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. మద్యం తాగి బహిరంగ ప్రదేశాల్లో ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు. హోలీ సందర్భంగా ప్రతి సంవత్సరం హైదరాబాద్ నగరంలో వైన్ షాపులు తెరిచేందుకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదు.మరోవైపు.. తెలియని వ్యక్తులపై కలర్ చల్లితే కఠిన చర్యలు తీసుకుంటామని కూడా సీపీ సజ్జనార్ హెచ్చరించారు. హోలీ పండుగ సందర్భంగా హైదరాబాద్‌లో పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. రోడ్లపై రంగులు చల్లుతూ వాహనదారులకు ఇబ్బంది కలిగించొద్దని.. అలా చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బైక్‌లు, కార్లు, ఇతర వాహనాలతో గుంపులు గుంపులుగా తిరగొద్దని పేర్కొన్నారు. రసాయన రంగులకు బదులు సహజ రంగులు వాడి.. హోలీ పండగను సహజ సిద్ధంగా జరుపుకోవాలని హితవు పలికారు. హోలీ పండగ సందర్భంగా డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. మహిళల రక్షణ కోసం షీ టీమ్స్‌తో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని సీపీ సజ్జనార్ తెలిపారు.మార్చి 3వ తేదీనే హోలీ పండగఈసారి హోలీ పండగ తేదీ విషయంలో తీవ్ర గందరగోళం తలెత్తింది. మొదట తెలంగాణ పాఠశాల విద్యా శాఖ తన అకడమిక్ క్యాలెండర్‌లో హోలీ పండగ సెలవు మార్చి 4వ తేదీ అని పేర్కొంది. కానీ ప్రస్తుతం హోలీ పండగను 3వ తేదీనే జరుపుకోవాలని పండితులు సూచిస్తున్నారు. దీంతో ప్రభుత్వం కూడా హోలీ పండగను 3వ తేదీకి మార్చింది. ప్రభుత్వ నిర్ణయంతో హోలీ సెలవును మార్చి 4వ తేదీ కాకుండా మార్చి 3వ తేదీనే అని తాజాగా తెలంగాణ పాఠశాల విద్యా శాఖ సర్క్యులర్ జారీ చేసింది.

భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక

మేడ్చల్ మల్కాజ్ గిరి






# అసాంఘిక కార్యక్రమాల అడ్డగా ప్రాథమిక పాఠశాల.

## కౌన్సిలర్ రుప్లానాయక్ కుటుంబానికి ఘన సన్మానం





**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి** 16వ వార్డ్ కౌన్సిలర్ శ్రీ కేతవత్ రుప్లా నాయక్ గారికి వారి ఇంటి కుటుంబ సమీక్షంలో సన్మానం చేయడం జరిగిందిఇట్టి సల్మాన కార్యక్రమంలో భాగంగా కౌన్సిలర్ గారి అన్నయ్య గారు గిరి బాబు మరియు దుబ్బ తండా సర్పంచ్ ఇంద్ర గారు అలానే కౌన్సిలర్ గారి మామ సోములు, సక్రం రాకేష్ తదితరులు. మన కౌన్సిలర్ కేతవత్ రూప్లా నాయక్ గారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## కార్ లో అక్రమంగా తరిస్తున్న నల్లబెల్లం,ఆలుం లను ఛేదించి పట్టుకున్నా ఎక్సైజ్ అధికారులు




**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి**
నేరేడుగొమ్ము మండలంలోని జోడుబావి తాండకు చెందిన కేతావత్ శ్రీను ను పేర్వాల సమీపంలో ఎక్సైజ్ దేవరకొండ అధికారులు పట్టుకున్నారు. 300 కిలోల నల్ల బెల్లం, 10 కిలోల ఆలుమ్, ఒక ఫోర్డ్ కారును స్వాధీనం చేసుకున్న సీహెచ్ఈఎస్ఐ నింధితుంది అధుపులో తీస్కొని చట్టపరమైన చార్యలు తీస్కుంటామని సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఇట్టి తనికీలో ఎస్ఐ నరసింహ కానిస్టేబుల్ భాను,రాము లు పాల్గొన్నారు

















**దేవరకొండ నియోజకవర్గం భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి**

చింతపల్లి మండలంలోని హోమెంతలపల్లి ప్రాథమిక ఉన్నంత పాఠశాలలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు నిన్న రాత్రి సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తాగి గంజాయి ఆనవాయితీలు ఉన్నాయి అని ప్రతిరోజూ ఇలాగే తాగి వెళ్లిపోతారని కాని నిన్న తగిన మైకం లో ఫర్నిచర్ పుస్తకాలు తినే ప్లేట్స్ లు బెంచీలు అన్ని తగలబెట్టి గంజాయి సేవించారు అని సర్పంచ్ తో పాటు పాఠశాల ప్రిన్సిపల్ కూడా అంటూన్నారు మా పాఠశాలకు తగిన సౌకర్యం ఉండాలని అలాగే సీసీ కెమెరాలు కూడా అవసరం ఉంది అని ప్రధానోపా ధ్యాయులు అన్నారు ఇదే విషయం చింతపల్లి పోలిస్టేషన్ లో సంప్రదించగా ఎస్ఐ రామ్మూర్తి మాట్లాడుతూ అనుమానితులను స్టేషన్ కి తీసుకొచ్చి విచారిస్తున్నామని త్వరలో పట్టుకుంటామన్నారు ఇంకో కోణం చూస్తే రాజకీయాలు జోరుగా జరుగుతున్న సమయంలో పక్షంలో ఉన్న వాళ్లెవరైనా చేసి ఉంటారా అని కూడా విచారిస్తున్నాం అని అన్నారు స్థానిక సర్పంచ్ కి మరియు పోటీచేసి ఓటమిపాలైన అభ్యర్థులకు ఇంకా పడడం లేదు అని వాళ్లే కావాలని చేసి ఉండొచ్చు అని స్థానికులు అంటున్నారు ఏది ఏమైనా గుడి లాంటి బడిలో ఇలా చేయడం తప్పు అని ఊర్లో ఉన్న వాళ్ళు అంటున్నారు

భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక

## జనగాం




# శ్రీ శ్రీ శ్రీ శివకేశవ పిరమిడ్ ధ్యానాలయం పాతకోట శివాలయం వనపర్తి

- జ్ఞాన దాత సూదిని జైపాల్ రెడ్డి యొక్క దివ్య సందేశం





**వనపర్తి, గద్వాల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ అవినాష్:**
ఈరోజు ఏది ఏమి జరిగినా నేను ఆనందంగా ఉంటాను
ఈరోజు నేను ఎవరిని తీర్పు చేయను, సంఘటనలు నేను నా జీవితంలో జరిగే సంఘటనలు, నేను ప్రతిక్షణం వర్తమానంలో ఉంటూ ప్రతి పనిని సంపూర్ణ ఎరుకతో చేస్తాను, నేను సూర్యుని కన్నా తేజవంతమైన ఆత్మను ఆత్మనేనే దేవున్ని, నేను ప్రతిరోజు క్రమం తప్పకుండా మూడు 3 గంటలు ధ్యానం చేస్తున్నాను, నేను చేపట్టే ప్రతి పనిలో అఖండ విజయం సాధిస్తున్నాను, నేనే సృష్టికర్తను నా వాస్తవాన్ని నేనే సృష్టించుకుంటున్నాను మరియు దానికి నేనే సంపూర్ణ బాధ్యత వహిస్తాను, ధ్యానం ఎంత ముఖ్యమో ప్రతిరోజు కొత్తది నేర్చుకోవడం కూడా అంతే ముఖ్యం, ధ్యానం ద్వారా వచ్చిన శక్తిని జ్ఞానాన్ని తనకోసం ఎరుకతో నా లక్ష్యసాధన కోసం సద్వినియోగం చేసుకుంటాను అంటూ అద్భుతమైన జ్ఞాన సందేశాన్ని అందించారు జైపాల్ రెడ్డి. ధ్యానులు ఈ కార్యక్రమానికి హాజరై ఎంతో చక్కగా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# ఘరానా మోసం కస్టమర్లకు మోసం చేసిన మణికంఠ ట్రేడర్స్ వ్యాపారి ఊరే శ్రీధర్






## రాజ్యసభ సీటు మాదిగలకు కేటాయించాలి : మంద కుమార్ మాదిగ

**హనుమకొండ చౌరస్తా, మార్చి 2:** తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభ సీటు మాదిగలకు కేటాయించాలని ఎమ్మెస్పీ జాతీయ నేత మందకుమార్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్యసభ సీటును మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కుమార్ మాదిగ మాట్లాడుతూ మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగల ఎమ్మెల్యే స్థానాలు తగ్గించి మాలలకు కేటాయించడం మాదిగ జాతికి తీరని అన్యాయం కాంగ్రెస్ పార్టీ చేసిందన్నారు.అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో మూడు పార్లమెంటు స్థానాలు ఉంటే ఒకటి కూడా మాదిగలకు కేటాయించకుండా కాంగ్రెస్ పార్టీ మాదిగ జాతిని మోసం చేసిందన్నారు. నామినేట్ పదవులల్లో మాదిగలకు అవకాశాలు రావాలని ముఖ్యమంత్రి ఇప్పటికైనా మాదిగ జాతికి తీరని అన్యాయం చేయకుండా రాజ్యసభ సీట్లు వెంటనే కేటాయించాలని లేని పక్షంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ




నాయకత్వంలో పోరాటానికి సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ జాతీయ నాయకులు వేల్పుల సూరన్న కాపు, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్రా బిక్షపతి మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, రాష్ట్ర నాయకులు మంద రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సుంచు రజినికుమార్ మాదిగ పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే యశస్విని, ఝాన్సీరెడ్డి..



**భవిష్యత్తు ప్రజాపాలన మార్చి02(పాలకుర్తి);**
తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సిరెడ్డి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వారు పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధి చెందాలని,ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, నియోజకవర్గంలో శాంతి, సమృద్ధి నెలకొని అన్ని వర్గాల ప్రజలు ఆయురారోగ్యాలతో ముందుకు సాగాలని వారు ప్రార్థించారు. దర్శనానంతరం ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు సమర్పించారు

## ఈరోజు ఎంపీ నివాసంలో బలరాం నాయక్ ను మర్యాదపూర్వకంగా కలిసిన గిరిజన సేవ సంఘం అధ్యక్షుడు వంకూడవత్ హనుమ నాయక్



**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వడ్త్య**
హైద్రాబాద్ లోని తన నివాసంలో యంపి బలరాం నాయక్ ను మర్యాదపూర్వకంగా కలిసి లంబాడీల జరుగుతున్నా అన్యాయానికి సంబంధించిన విషయాలు మాట్లాడడం జరిగింది అలాగే రాబోవు రాజ్యసభ లో లంబాడీల స్థానం కల్పించాలని కోరడం జరిగింది అందుకు సానుకూలంగా స్పందిన ఎంపీ బలరాం నాయక్ నావంతు సహాయం పక్క అందిస్తానని ఈ విషయానికి సంబంధింది సీఎం రేవంత్ రెడ్డి గారితో మాట్లాడుతానని హామీ ఇవ్వడం జరిగింది అని హనుమ నాయక్ అన్నారు ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక



## నల్గొండ



# బాల్యవివాహాల వల్ల విద్య ఆగిపోతుంది ,ఆరోగ్య సమస్యలు వస్తాయి, భవిష్యత్తు నాశనం అవుతుంది


**- సిడిపిఓ శ్రీమతి చంద్రకళ**




**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి**

దేవరకొండ ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో దేవరకొండ గర్ల్స్ హై స్కూల్ నందు బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించడం జరిగినది, ఈ కార్యక్రమంలో సిడిపిఓ శ్రీమతి చంద్రకళ గారు మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు వివరించడం జరిగింది, బాల్యవివాహాల వల్ల విద్య ఆగిపోతుంది ,ఆరోగ్య సమస్యలు వస్తాయి, భవిష్యత్తు నాశనం అవుతుంది ,కాబట్టి ఎక్కడైనా బాల్యవివాహం జరిగే పరిస్థితి ఉంటే వెంటనే 1098 హెల్ప్ లైన్ నెంబర్ కి సమాచారం ఇవ్వాలి అని తెలియజేశారు, బాలిక విద్యా ప్రాముఖ్యత ,విద్య అనేది బాలిక ప్రాథమిక హక్కు బాలికను కాపాడితే సమాజం అభివృద్ధి చెందుతుందని బాలిక చదివితే దేశం ముందుకు సాగుతుందని తెలియజేశారు, పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం అజ్గరి కథూన్ సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా బాలబాలికలపై పడుతుంది సోషల్ మీడియాను ఎంతవరకు అవసరమో అంతవరకే ఉపయోగించుకోవాలి అని తెలియజేశారు, తెలియని వ్యక్తులతో చాట్ చేయకూడదు, వ్యక్తిగత సమాచారం మరియుఫోటోలు పంపకూడదు అని వివరించడం జరిగింది. విజయలక్ష్మి సూపర్వైజర్ మాట్లాడుతూసైబర్ బుల్లింగ్ డిజిటల్ వైలెన్స్ జరిగినట్లయితే 1930 , మహిళా హెల్ప్ లైన్ 181 నెంబర్ కి సమాచారం ఇవ్వాలి అని తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమం లో బాలికలకు చైల్డ్ మ్యారేజ్ వలన కలిగే నష్టాలపై వ్యాసరచన పోటీ నిర్వహించి వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు ప్రధానం చేయడం జరిగినది , ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ డి చిట్టెమ్మ స్కూల్ టీచర్స్ అంగన్వాడి టీచర్స్ మణెమ్మ,సుశీల  పాల్గొనడం జరిగినది

# ఘనంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాద రావు  జయంతి



**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన**

మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాద రావు గారి జయంతిజరిగిందిసందర్భంగా ఫోటోకి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది . ఇట్టి కార్యక్రమం నందు నాయకులు పున్న వెంకటేశ్వర్లు, మునిసిపల్ మేనేజర్ అర్చన, అసిస్టెంట్ ఇంజనీర్ రాజు, సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్ గౌడ్, నాయకులు సైదులు, సత్యం, మునిసిపల్ సిబ్బంది కవిత, పద్మ, సక్రునాయక్, రాజేష్, శ్రీనాధ్, రమాకాంత్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్య మూల లో ఉపాధి హామీ పనులు ప్రారంభించిన సర్పంచ్



**కొండమల్లెపల్లి భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి**


నక్కలపెంట తండ గ్రామ పంచాయతీ లో గౌరవ సర్పంచ్ శ్రీమతి జాటావత్ విమల స్వామి నాయక్ గారు పల్లె ప్రకృతి వానం దగ్గర గల సూర్య మూల లో ఉపాధి హామీ పనులు ప్రారంభించడం జరిగింది.సర్పంచ్ గారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు వరం వంటిది అని. ప్రతి ఒక్కరూ మంచిగా పని చేసి తమ జీవనప్రమాణాలను పెంచుకోవాలని సూచించారు.అలాగే ఎవరైనా రైతులు పండ్ల తోటలు పెట్టుకోవాలన్న,గొర్రెలు, బర్రెల షెడ్లు నిర్మాణాలు చేపట్టాలన్న గ్రామ పంచాయతీ లో సంప్రదించాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ విమల స్వామినాయక్ ఉప సర్పంచ్, అంగోత్ మున్య పంచాయతీ సెక్రటరీ నాగరాజు, వార్డ్ సభ్యులు,సీనియర్ మేట్ జైత్రం మరియు గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కొండమల్లేపల్లి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ఒక ప్రాణం మీదకు తెచ్చింది.










**కొండమల్లెపల్లి భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి**

తన భూమిని అక్రమంగా వేరొకరికి రిజిస్ట్రేషన్ చేస్తున్నారంటూ మనస్తాపానికి గురైన ఓ రైతు తహసీల్దార్ కార్యాలయం సాక్షిగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.మండల పరిధిలోని కొత్త బావి గ్రామానికి చెందిన పిల్లి లింగయ్య అనే రైతుకు చెందిన భూమిని అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వేరొకరి పేరు మీద మారుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. న్యాయం కోసం కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా అధికారులు పట్టించుకోకపోవడంతో విసిగిపోయిన లింగయ్య సోమవారం ఎమ్మార్వో కార్యాలయ ఆవరణలోనే ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేశారు.అక్కడ ఉన్న స్థానికులు తక్షణమే స్పందించి ఆయన్ని అడ్డుకోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. అధికారుల తీరుపై బాధితుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడికి న్యాయం చేయాలని అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక
వరంగల్



# మామిళ్ళపల్లి గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించిన స్వామివారి కళ్యాణోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి దంపతులు

**ఉప్పునుంతల భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘుసాగర్ :** ఉప్పునుంతల మండలం మామిళ్ళపల్లి గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈరోజు వైభవంగా నిర్వహించిన స్వామివారి కళ్యాణోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దంపతులు డా. కూచుకుళ్ల సరిత రాజేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కళ్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వీక్షించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామ ప్రజలు, భక్తులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావం ణంతో నిండిపోయింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మామిళ్ళపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంత ప్రజల ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అలాగే దేవాలయ అభివృద్ధి, సౌకర్యాల విస్తరణకు అవసరమైన సహకారం అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.









# శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా "30 పోలీస్ యాక్ట్" అమలు జిల్లా ఎస్పీ

**- మార్చి 1 నుంచి 31 వరకు "30 పోలీస్ యాక్ట్" అమలు**

**- ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధం**

**- ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే కార్యక్రమాలకు కఠిన చర్యలు**



**వనపర్తి గద్వాల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ అవినాష్:** జిల్లాలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయడం, ప్రజల సాధారణ జీవనాన్ని నిరంతరాయంగా కొనసాగించడం, అనవసర గుమికూడింపులు నివారించడం లక్ష్యంగా మార్చి 01 నుంచి మార్చి 31 వరకు 30 పోలీస్ యాక్ట్--1861 అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ జిల్లా పరిధిలో ప్రజా జీవనానికి అంతరాయం కలిగించే శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎవరైనా పోలీసు ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, భారీ స్థాయి సమావేశాలు నిర్వహించడం కఠినంగా నిషేధం. అలాగే "30 పోలీస్ యాక్ట్" ఉల్లంఘనలకు చట్టంలో స్పష్టమైన శిక్షలు ఉన్నాయి. అనుమతి లేకుండా కార్యక్రమాలు చేపట్టిన వారిపై ఎటువంటి మినహాయింపు లేకుండా చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ప్రజల భద్రత కోసం పెట్టబడ్డాయి... అందరూ తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. ఎస్పీ గారు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ఏ కార్యక్రమం చెయ్యాలన్నా ముందుగానే దరఖాస్తు చేసి అనుమతి పొందండి. ప్రజల సహకారం వల్లనే శాంతిభద్రతలు నిలుస్తాయి. పోలీసుల చర్యలు ఏవైనా ప్రజల రక్షణ కోసమేనని ఎస్పీ గారు తెలిపారు.

# ఉచిత ప్రయాణం పూర్తిగా అవాస్తవం : టీజీఎస్ ఆర్టీసీ

ఇటీవల వివిధ సోషల్ మీడియాలో ɹ+ూ=ɹజ బస్సుల్లో దివ్యాంగులకు సంబంధించి వస్తున్న వార్తలపై టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం స్పష్టత ఇచ్చింది. దివ్యాంగులందరికీ బస్సుల్లో పూర్తిగా ఉచిత ప్రయాణం కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి కొత్త ఉత్తర్వులు జారీ చేయలేదని టీజీఎస్ ఆర్టీసీ పేర్కొన్నది. సోషల్ మీడియాలో వస్తున్న ఈ వార్త పూర్తిగా అవాస్తవమని తెలిపింది. ఇలాంటి తప్పుడు వార్తలను సోషల్ మీడియాలో ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే వారిపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ప్రజలు ఇటువంటి పుకార్లను నమ్మవద్దని, ఏదైనా కొత్త నిర్ణయం తీసుకుంటే పత్రికా ప్రకటన ద్వారా లేదా అధికారిక ɹ+ూ=ɹజ వెబ్‌సైట్ ద్వారా గాని వెల్లడించడం జరుగుతుందని టీజీఎస్ ఆర్టీసీ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది.

# ఘనంగా ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుదిళ్ళ శ్రీపదారావు గారి జయంతి



**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి**
ఎంపీడీఓ కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాల్గొన్న ఎంపీడీఓ పార్వతి. ఎంపీవో సాగర్. మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్. వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు

# దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు.. కేతావత్ రుప్లానాయక్

**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి మార్చి:03**
హోలీ రంగుల పండుగ హోలీ, మీ అందరీ జీవితాలను రంగులతో నింపాలని కోరుకుంటూ.. దేవరకొండ 16వ వార్డ్ కౌన్సిలర్ శ్రీ కేతావత్ రుప్లా నాయక్ గారు. ఈ హోలీ నాడు మీ కష్టాలన్నీ తొలగించాలని. మీ జీవితం అనందమయం కావాలని అకాంక్షిస్తూ. దేవరకొండ నియోజకవర్గం ప్రజలకు మరియు మన 16వ వార్డు ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు.. తెలియజేశారు.



# కిడ్జీ స్కూల్ లో ఘనంగా హోలీ వేడుకలు



**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి**
నేడు పండగ సందర్భంగా హోలీ పండుగ పురస్కరించుకుని హోలీ వేడుకలు స్కూల్లో ఘనంగా జరుపుకున్నారు చిన్నారులు సంతోషంగా ఆటలతో ఆడి పాడి అందర్నీ ఆకట్టుకున్నారు



భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక
నాగర్‌కర్నూల్





# న్యాయం కోసం పోరాడితే అసత్య ఆరోపణలు,నిజ నిర్ధారణ కమిటీ పేరుతో కాంగ్రెస్ డ్రామా కాంగ్రెస్ కుట్రలను సమాజం గుర్తించింది




**నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :**
పక్క నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యే లను తీసుకొచ్చి మర్రి జనార్ధన్ రెడ్డి తిట్టిస్తున్నారు,ఇంకా ఎన్ని రోజులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారు, ఒకవైపు అక్రమ కేసులతో ఎమ్మెల్యే ఎమ్మెల్సీలు పైశాచిక ఆనందం పొందుతూ తమ పార్టీ నాయకులను కాపాడుకోడానికి చిల్లర రాజకీయాలు చేస్తున్నారు,బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కుమ్మెర సంఘటనలో మృతి చెందిన చిన్నారి పాప కుటుంబానికి అండగా నిలిచేందుకు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి పోలీసులను నిలదీస్తూ ఆందోళనకు మద్దతు ఇస్తే కాంగ్రెస్ పార్టీ కి చెందిన కొందరు ప్రజా సంఘాల ముసుగులో మాజీ ఎమ్మెల్యే పై అసత్య ఆరోపణలు చేస్తూ డబ్బులు ఇచ్చి ఉద్యమాన్ని నిర్వహించారని పేర్కొనడం దారుణమని బిఆర్ఎస్ నాయకులు ఐతోల్ లక్ష్మయ్య మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ మాజీ జెడ్పిటిసి శ్రీశైలం దీ=హా తిమ్మాజిపేట మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్ కుమార్ స్థానిక కౌన్సిలర్ తిమ్మాజీపేట పాండు మండిపడ్డారు,సోమవారం మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐతోల్ లక్ష్మయ్య మాట్లాడుతూ 18న కుమ్మెర గ్రామంలో చాకలి సామాజిక వర్గానికి చెందిన గణేష్ పై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలని చిన్నారి పాప మృతికి కారణమైన వారందరిపై హత్య కేసు నమోదు చేయాలని అనేక ప్రజా సంఘాలు ఆందోళన చేస్తే విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి బాధితుల పక్షాన అండగా నిలిచేందుకు ఆందోళనలో పాల్గొని పోలీస్ అధికారులు నిలదీయడం మానవత్వంతోనే చేయడం జరిగిందని దీనిని రాజకీయం చేసేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు ప్రజాసంఘాల ముసుగులో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మర్రి జనార్దన్ రెడ్డి పై విమర్శలు చేయడం తగదని హెచ్చరించారు. ఎన్నో ఉద్యమాలు చేసిన వారు కూడా బాధితుల పక్షాన నిలవకుండా నిందితులకు కొమ్ముకాసేందుకు బీసీ నేతలపై విమర్శలు చేయడం తగదన్నారు బాధితులు లేకుండానే నిజ నిర్ధారణ కమిటీ గ్రామంలో రాజకీయం చేసిందని ఆరోపించారు. సంఘటనలో దోషులను శిక్షించాలని డీజీపీ ఎందుకు కలిశారని ఆయన ప్రశ్నించారు మర్రి జనార్దన్ రెడ్డి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించడంతోపాటు కేటీఆర్ ను తీసుకువచ్చి వారి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించే విధంగా కృషి చేశామని తెలిపారు,ఈ సమావేశంలో కౌన్సిలర్లు అర్జునయ్యా కొత్త గంగాధర్, జయప్రకాష్ చారి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య,సర్పంచులు రామకృష్ణ,బాల వెంకటయ్య,మాజీ ఎంపీటీసీ సుధాకర్,లక్ష్మయ్య ,దీ=హా పార్టీ నాయకులు మంచాల పర్వతాలు,బోనసి లక్ష్మయ్య,రాఘవ చారి,వెంకటయ్య,సంజీవ,కొత్త వెంకటేష్,సైపుద్దీన్,ప్రశాంత్ తో పాటు ఎనాయకులు పాల్గొన్నారు

## నూతన జిల్లా కలెక్టర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన TWJF జిల్లా నాయకులు, అధ్యక్షుడు ఢ జోగులాంబ టీవీ సీఈఓ,బి.గిరి బాబు



**గద్వాల జిల్లా** ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టరేట్ నందు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులతో కలిసి, డి.పి.ఆర్.ఓ(ఞూ=హా) గారి ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ రిజ్వాన్ భాషా షేక్ ఐ.ఏ.ఎస్. గారిని ఎౌజీఖీ జిల్లా అధ్యక్షుడు,జోగుళాంబ టీవీ సీఈఓ,బి.గిరి బాబు గారు మర్యాదపూర్వకంగా కలిసి,పూలబొక్కే ఇచ్చి,శాలువాతో ఘనంగా సత్కరించి, హార్ధిక శుభాకాంక్షలు తెలిపారువీరితో పాటు,TWJF జిల్లా ఉపాధ్యక్షులు సురేష్,కె.బి. తిమ్మప్ప, శ్రీనివాసులు,బిసన్న,సిరిగిరి కృష్ణ,రిపోర్టర్ పరమేష్ మరియు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ రిపోర్టులు పాల్గొన్నారు.

## చంద్రగ్రహణం సందర్భంగా నేడు పెద్దగూడెం గ్రామం లోని కోదండ రామాలయం మూసివేత



**వనపర్తి గద్వాల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ అవినాష్:**
ఈనెల 3న అనగా నేడు మంగళవారం చంద్రగ్రహణం సందర్భంగా కావున వనపర్తి మండలంలోని పెద్దగూడెం గ్రామంలో కోదండ రామస్వామి దేవాలయం మూసి వేయనున్నట్లు ఆలయ అర్చకులు రామ స్వామి అయ్యగారు తెలిపారు. నేటి ఉదయం 7:00 గంటల నుండి సాయంత్రం 7:30 గంటల వరకు దర్శనాలు నిలిపివేస్తారు. అనంతరం ఆలయ శుద్ధి, విశేష పూజలు నిర్వహించి భక్తులను అనుమతిస్తారు. భక్తులు ఈ మార్పును గమనించి అందరికీ సమాచారాన్ని తెలియజేయగలరని కోరారు

## ఆలేరు పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

**నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :**



జిల్లాలోని ఆదివారం రోజు కల్వకుర్తి పట్టణంలో బాలురు ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలో తెలకపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆలేరుకు చెందిన ఏడవ తరగతి విద్యార్థిని ఎం మధుప్రియ అండర్ 14 సంవత్సరాలలో బాలికల విభాగంలో 60 మీటర్ల పరుగు పందెములో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయింది. ఈనెల 15న హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స లో పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ జి. నరహరి ఫిజికల్ డైరెక్టర్ౘా.బాలయ్య తెలిపారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు మరియు గ్రామ సర్పంచ్ ఆనంద్ అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ శ్రీమతి అమృతమ్మ గ్రామ పెద్దలు వీరిని అభినందించారు,